

హైదరాబాద్ వార్త

ఘనంగా సైక్లింగ్ రేస్ ప్రారంభం

-20 రాష్ట్రాల నుంచి హాజరైన క్రీడాకారులు

జెండా ఊపి క్రీడలను ప్రారంభిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

ఎల్.బి.నగర్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: క్రీడారంగంలో మహిళలను ప్రోత్సాహం ఇస్తే వాళ్ళు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ బండ్లగూడలో అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ నేషనల్ సైక్లింగ్ లీగ్ పోటీలను శ్రీనివాస్‌గుప్తా ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు క్రీడల్లో ముందుకు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. యువతిలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ఇటువంటి పోటీలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ క్రీడాకారులను అన్ని విధాలా అండగా నిలుస్తుంది అన్నారు. ఈ సైక్లింగ్ పోటీల్లో 20 రాష్ట్రాల నుండి (సౌత్, ఈస్ట్, వెస్ట్, నార్త్) మంది సబ్‌జూనియర్ బాలికలు, జూనియర్, ఎలైట్ విభాగాల్లో 120 మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. నిర్వాహకులు పోటీ లను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మాక్స్వెల్ శ్రీకాంత్, క్రీడా ప్రముఖులు, కోచ్‌లు పాల్గొన్నారు.

చెరువుల అభివృద్ధి పనులు రెండు నెలల్లో పూర్తిచేయాలి

- హైడ్రా కమిషనర్ ఎ.వి రంగనాథ్ -మాదాపూర్‌లోని తుమ్మిడికుంట, సున్నం చెరువు పరిశీలన

చెరువు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త: మాదాపూర్‌లోని తమ్మిడికుంటతో పాటు సున్నం చెరువులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ శనివారం పరిశీలించారు. చెరువుల పునరుద్ధరణ పనులు జరుగుతున్న తీరును క్షేత్ర స్థాయిలో అధికారులతో సమీక్షించారు. రెండు నెలల్లో చెరువుల అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. శుక్రవారం సిఎం రేవంత్ రెడ్డి ఆకస్మికంగా తమ్మిడికుంటను పరిశీలించిన నేపథ్యంలో హైడ్రా కమిషనర్ శనివారం సందర్శించారు. ఐటీ కేంద్రానికి చేరువుగా ఉన్న తమ్మిడికుంటను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే కాకుండా.. ఇక్కడకు వస్తే ఒత్తిడి కూడా దూరమయ్యేలా అభివృద్ధి చేయాలని సిఎం సూచించిన విషయాన్ని చెరువు అభివృద్ధి పనులు పర్యవేక్షిస్తున్న అధికారులకు తెలిపారు. చెరువు చుట్టూ పచ్చదనం నిండుగా కనిపించాలని బయట కంటే చెరువు చెంత 3 నుంచి 4 డిగ్రీల ఉష్ణోగ్రతలు తక్కువ ఉండేలా పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. చెరువు చుట్టూ పాత్ వేలు, కూర్చొని సేద దీరేందుకు వీలుగా సీటింగ్ వ్యవస్థ, పార్కులు, పచ్చిక బైళ్లు.. ఉండేలా చూడాలన్నారు.

ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోండి..

చెరువుల చుట్టూ ఉన్న ప్రభుత్వ భూముల గురించి పూర్తి స్థాయిలో విచారించి.. వాటిని స్వాధీనం చేసుకుని చెరువు అభివృద్ధిలో భాగం చేయాలని అధికారులను కమిషనర్ రంగనాథ్ ఆదేశించారు. ఆక్రమణదారుల పత్రాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. సున్నం చెరువు చెంత సర్వే నంబరు 30, 31కి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకుని.. ప్రభుత్వ భూమి ఉంటే అంగుళం కూడా పోకుండా సెక్యూర్ చేయాలన్నారు. ఈ రెండు సర్వే నంబర్ల మధ్య ఉన్న ప్రభుత్వ భూమికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకోవడమే కాకుండా.. క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. తమ్మిడికుంట చెరువుకు పై భాగంలో కింది భాగంలో ఉన్న ప్రభుత్వ భూములను తమదిగా క్లైమ్ చేస్తున్న వారి పత్రాలను పరిశీలించాలన్నారు. తమ్మిడికుంట చెరువును ఎంతో సుందరంగా తీర్చిదిద్దుతుంటే.. పై భాగంలో వేస్తున్న చెత్త, వ్యర్థాల వల్ల మళ్లీ నీరు కలుషితమయ్యే ప్రమాదముందని హెచ్చరించారు. అలాగే సున్నం చెరువు చెంతన ఉన్న బోరబండ బస్తీ, ఎన్ ఆర్ ఆర్ పురం నుంచి వచ్చే వరద నీరు నేరుగా చెరువులోకి కలిసేలా ఇన్‌లెట్లను రంగనాథ్ పరిశీలించారు. వరద నీరు చెరువులోకి చేరేలా.. మురుగు నీరు కిందకు పోయేలా డైవర్ట్ కాలువ నిర్మాణం కూడా పూర్తయ్యిందని.. త్వరలో అనుసంధానం చేయాల్సి ఉందని అధికారులు వివరించారు. అయితే ఈ అనుసంధానం జరగకపోవడంతో సున్నం చెరువు రోడ్డు నుంచి బస్తీలోకి వెళ్లే మార్గం ప్రమాదకరంగా మారిందని.. ఇక్కడ పైపులైన్లు వేసి మురుగు సాఫీగా సాగేలా చూడాలని స్థానికులు కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా.. రెండు రోజుల్లో మున్సిపల్ అధికారులతో కలిసి వచ్చి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. సున్నం చెరువును ఆనుకుని వెళ్తున్న హైటెన్షన్ వైర్ల కింద ఆక్రమణలను తొలగించి.. రహదారి విస్తరణపై చర్యలు తీసుకోవాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు.

నారపల్లి ఫ్లైఓవర్ పనులు వేగవంతం చేయాలి

-భవన నిర్మాణాల్లో నిబంధనలు తప్పనిసరి పాటించాలి
-నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు
-క్షేత్రస్థాయి పర్యటనలో ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

మల్కాజ్‌గిరి నగర పాలక సంస్థ పరిధిలో పర్యటిస్తున్న ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: 99 రోజుల కార్యాచరణ – ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మల్కాజ్ గిరి నగరపాలక సంస్థ పరిధిలోని ఉప్పల్ నారపల్లి, కళ్యాణపురి, రాంథాపూర్, రాంరెడ్డి నగర్, బాలాజీ ఎన్ క్లేవ్, అజ్మత్ నగర్ ప్రాంతాల్లో ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా నారపల్లి ఫ్లైఓవర్ పనుల పురోగతిని సమీక్షించారు. డీసీ, డీఈ, ఈఈ, ఏఈ అధికారులతో కలిసి నిర్మాణ పనులను పరిశీలించారు. నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలని అధికారులు నిర్మాణ సంస్థలకు సూచించారు. పనుల వేగవంతానికి ప్రాధాన్యం ఇస్తూనే, భద్రతా ప్రమాణాలు మరియు ఇంజినీరింగ్ నిబంధనలు కచ్చితంగా టించాలని స్పష్టం చేశారు. ఉప్పల్‌లోని కల్యాణపురి ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. అన్ని వాణిజ్య సంస్థలు తప్పనిసరిగా నిబంధనల ప్రకారం చెల్లుబాటు అయ్యే ట్రేడ్ లైసెన్సులు పొందాలని సూచించారు. అలాగే దుకాణాలను కూడా పరిశీలించి, ట్రేడ్ లైసెన్సుల చెల్లుబాటు పరిస్థితిని తనిఖీ చేశారు. వాణిజ్య సంస్థలపై నియమ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, బాధ్యతాయుతమైన నిర్వహణ ఉండాలని అధికారులకు కఠిన ఆదేశాలు జారీ చేశారు. వీటితో పాటు రాంథాపూర్, రామరెడ్డి నగర్, మల్కాజ్‌గిరి ప్రాంతాల్లో పర్యటించి స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కుమారస్వామి మహిళా గ్రూప్‌కు చెందిన శ్రీమతి శైలజ స్వయం సహాయక సంఘం సాయంతో తయారు చేసిన తన ఎంబ్రాయిడరీ పనులను ప్రదర్శించారు. ఆమె నైపుణ్యం, అంకితభావాన్ని కమిషనర్ ప్రశంసించి, తన పనిని మరింత విస్తరించుకోవాలని ప్రోత్సహించారు. అలాగే స్వయం సహాయక సభ్యులు ఇలాంటి కార్యక్రమాలను మరింత మంది మహిళలలో ప్రోత్సహించాలని సూచించారు. అంతేకాకుండా ఉప్పల్‌లోని బాలాజీ ఎన్‌క్లేవ్, అజ్మత్ నగర్ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సందర్భంగా కొత్తగా నిర్మించిన భవనాలను పరిశీలించి, అనుమతించిన సెట్ బ్యాక్ నిబంధనలు, అంతస్తుల పరిమితులు పాటిస్తున్నారా అనే విషయాన్ని సమీక్షించారు. ఈ సందర్భంగా అన్ని నిర్మాణాల్లో సెట్ బ్యాక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని అనుమతించిన భవన అంతస్తుల పరిమితులకు లోబడే నిర్మాణం చేపట్టాలని స్పష్టం చేశారు. నిర్మాణాల్లో నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు.

రోడ్డు ఆక్రమించి వ్యాపారాలు ..డబ్బాల తొలగింపు



ఆరాంఘర్‌లో రోడ్డు ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు తొలగిస్తున్న జిహెచ్ఎంసి టౌన్‌ప్లానింగ్, పోలీస్ అధికారులు

అత్తాపూర్ ఏప్రిల్ 4, ప్రభాతవార్త : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఆరాంఘర్ నుండి డైయిరీ ఫామ్ చౌరస్తా వరకు రోడ్డు ఆక్రమించి ఏర్పాటు చేసుకున్న డబ్బాలను జిహెచ్ఎంసి అధికారులు పోలీసు బందోబస్తుతో కూల్చివేతలు చేపట్టారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి ఆదేశాలతో శనివారం రహదారి పక్కన ఉన్న చిరు వ్యాపారుల డబ్బాలను అధికారులు తొలగించే చర్యలు చేపట్టారు. దింతో పలువురు వ్యాపారులు అధికారులతో కొద్దిసెపు గొడవ దిగారు. స్థానిక వ్యాపారుల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఎలాంటి గొడవలు, ఉద్రిక్తతలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తగా భారీగా పోలీసులను మోహరించారు. అధికారులు, పోలీసులు సమన్వయంతో పరిస్థితిని అదుపులో ఉంచుతూ తొలగింపు చర్యలు కొనసాగించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నట్లు రోడ్డు ఆక్రమణతో నిత్యం ట్రాఫిక్ జాం అవుతుందన్నారు. రోడ్డు ఆక్రమించి డబ్బాలు ఏర్పాటు చేసుకొని వ్యాపారం సాగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చిరు వ్యాపారుల ఆవేదన

తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఎలా తొలగిస్తారని కాస్త సమయం ఇస్తే తామే తొలగించుకుంటామని చిరు వ్యాపారులు రాజేంద్రనగర్ సర్కిల్ డిసి సురేందర్ రెడ్డిని ప్రాధేయపడ్డారు. వారి మాటలు పట్టించుకోకుండా డబ్బాలను తొలగింపు చర్యలు కొనసాగించారు.

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో..

కంటోన్మెంట్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా, రాకపోకలకు అంతరాయం కలిగించే విధంగా అక్రమ వ్యాపార కార్యకలాపాలు చేపడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని జిహెచ్ఎంసి డిప్యూటీ కమీషనర్లు అంజనేయులు, జ్యోతి పుష్పలత, ప్రవీణ్ రెడ్డిలు హెచ్చరించారు. శనివారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ రేతిఫైల్ బస్టాండ్, గణేష్ దేవాలయం, అల్ఫాహోటల్, పాలిక బజార్, మోండా మార్కెట్, ఓల్డ్ గాంధీ ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకొని వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తున్న దుకాణాలను, అక్రమ షెడ్లను, గుడారాలను జిహెచ్ఎంసి, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసుల సహకారంతో కూల్చివేశారు. పాద చారులు, వాహన చోదకులు రద్దీ సమయాల్లో బయటకు వెల్లకుండా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయాన్ని గమనించిన జిహెచ్ఎంసి టౌన్‌ప్లానింగ్ విభాగం లా అండ్ అర్డర్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కూల్చివేతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మంగతాయారు.

జిహెచ్ఎంసి ఛీఫ్ సిటీ ప్లానర్లు శ్రీనివాస్, ఏసీపీలు సాయిబాబా, పావనీ, శ్రీనివాస్, క్రిష్ణకుమార్ లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కిషన్‌రెడ్డి, తలసాని, పద్మారావు గౌడ్ దృశ్యం

కంటోన్మెంట్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అందుకు అనుగుణంగా పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శనివారం మోండా డివిజన్ లో 4 కోట్ల 1.70 లక్షల రూపాయల వ్యయంతో వివిధ ప్రాంతాలలో చేపట్టనున్న దిది రోడ్ల నిర్మాణ పనులను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌లు కలిసి ప్రారంభించారు. ముందుగా ఓల్డ్ జైల్ ఖానా సమీపంలో 24 లక్షల రూపాయల వ్యయంతో, ఆదయ్య నగర్ కమాన్ వద్ద 65.60 లక్షల వ్యయంతో, టకారా బస్తీలో 80.50 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న దిది రోడ్డు పనులను సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ తో కలిసి ప్రారంభించారు. అనంతరం మోండా మార్కెట్ సర్కిల్ లో కోటి 85 లక్షల రూపాయల వ్యయంతో, సాంబమూర్తి నగర్ లో 46.60 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న దిది రోడ్డు పనులను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ లు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ నిత్యం ఎంతో రద్దీగా ఉండే మోండా మార్కెట్ ప్రాంతం, పేదలు అధికంగా నివసించే కాలనీలు, బస్తీలలో రహదారులు ఇబ్బందికరంగా ఉన్న నేపథ్యంలో దీర్ఘకాలం పాటు ఎంతో నాణ్యతగా ఉండేలా దిది రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, ప్రజల మధ్యనే ఉంటూ వారి అవసరాలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు ఆకుల హరికృష్ణ, నాయకులు తలసాని స్కైలాబ్ యాదవ్, గందే నాగులు, కొండాపురం మహేష్ యాదవ్, మధు, రాములు, సత్యనారాయణ, ప్రమోద్, వెంకటేశం, అమర్ తదితరులు ఉన్నారు.

ఎల్‌పిజి గ్యాస్ దొరకడం లేదని టవర్ ఎక్కిన ఆటో డ్రైవర్



వనస్థలిపురం. ఏప్రిల్. 4. ప్రభాతవార్త : తాను ఆటో నడుపుకుంటు జీవనం సాగిస్తున్నానని, గత కొన్ని రోజులుగా ఎల్.పి. జి. ఆటో గ్యాస్ దొరకడం లేదని నిరసన వ్యక్తం చేస్తూ శనివారం జానీ బాబు అనే ఆటో డ్రైవర్ చింతలకుంట లోని రేడియో టవర్ ఎక్కి హల్చల్ చేసాడు. కడప జిల్లా, తుమ్మలపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ జానీబాబు గత కొంతకాలంగా నగరానికి వచ్చి ఆటో నడుపుకుంటు జీవనం సాగిస్తున్నాడు. కాగా గత కొన్ని రోజులుగా ఆటో గ్యాస్ దొరకడం లేదని ,తన ఆటో ను చింతలకుంట సమీపంలో గల రేడియో టవర్ కింద పెట్టి, రేడియో టవర్ ఎక్కాడు. అనంతరం 100 కు డయల్ చేసి తాను రేడియో టవర్ పైకి ఎక్కానని సమాచారం ఇచ్చాడు. సమా చారాన్ని అందుకున్న వనస్థలిపురం పోలీసులు, హైడ్రా సిబ్బంది, ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆటో డ్రైవర్ ను కిందకు దిగాలని చెప్పినప్పటికీ, ఆటో డ్రైవర్ జానీ కిందకు దిగలే దు. గ్యాస్ గురించి సి.ఎం. రేవంత్ రెడ్డితో మాట్లాడాలని ,సమస్యను పరిష్కరించాలని కోరాడు. పోలీసులు తాము సమస్యను పరిష్కరిస్తామని చెప్పి ఎట్టకేలకు కిందకు దింపారు. వనస్థలిపురం నుండి ఎల్.బి.నగర్ వరకు ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఆటో డ్రైవర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి విచారిస్తున్నారు.

జూబ్లీహిల్స్‌లో ఆర్టీసీ బస్సు ఢీకొని విద్యార్థి మృతి

సంజీవరెడ్డి నగర్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త: జూబ్లీహిల్స్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో 14 ఏళ్ల విద్యార్థిని మృతిచెందింది. పోలీసుల వివరాల ప్రకారం, వాచ్‌మెన్‌గా పనిచేసే కాంచీ ప్రసాద్ (37) కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. ప్రతిరోజూ తన ఇద్దరు పిల్లలను ఎస్సార్ నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు తీసుకెళ్లి తిరిగి తీసుకొస్తాడు. సుమారు 12:45 గంటలకు పిల్లలను స్కూల్ నుంచి తీసుకుని బైక్‌పై ఇంటికి బయలు దేరాడు. రోడ్ నెం.5 మెట్రో స్టేషన్ సమీపంలోని మెట్రో పిల్లర్ నెం.1556 వద్ద వెనుక నుంచి ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సు (టీజీ10టి 1451) వేగంగా, నిర్లక్ష్యంగా వచ్చింది. అదే సమయంలో రోడ్డుపై నీరు నిల్వ ఉండటం, అలాగే తెల్ల రంగు బీఎండబ్ల్యూ కారు (టీఎస్ 07 జేపీ 5865) రోడ్డుపై పార్క్ చేయబడటంతో, కారు ఢీకొట్టకుం డా తప్పించుకునే క్రమంలో ప్రసాద్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో బైక్‌పై నియంత్రణ కోల్పోయాడు. ఈ సమయంలో బస్సు పక్కనే వెళ్తుండగా కుమార్తె కీర్తిక (14) కిందపడింది. బస్సు వెనుక చక్రం ఆమె తలపై ఎక్కడంతో తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కుమారుడు సాయి(11) ఎడమ చేయి విరగడంతో పాటు స్వల్ప గాయాలు కాగా, ప్రసాద్‌కు కూడా గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి అంబులెన్స్ ద్వారా వారిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. బస్సు డ్రైవర్ ,రోడ్డుపై పార్క్ చేసిన కారు యజమాని, అలాగే నీరు నిల్వ ఉండేలా రోడ్డు నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన జీహెచ్ఎంసీ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంచీ ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నారు.

‘శిశు విహార్’ను సందర్శించిన జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి అరుణకుమారి

పిల్లల సంరక్షణ, పనితీరును పరిశీలిస్తున్న జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి అరుణకుమారి

హైదరాబాద్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త హైదరాబాద్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ (డిఎల్ఎస్ఎ) కార్య దర్శి అరుణ కుమారి శనివారం అమీర్‌పేటలోని ప్రభు త్వ ‘శిశు విహార్’ను సందర్శించారు. ఈ సందర్భంగా భాగంగా ఆమె చిన్నారుల సంరక్షణ, వసతులు సంస్థ పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. సందర్శనలో శిశు విహార్‌లోని నివాస గదులు, వంటశాల మరియు ప్రాంగణంలోని పరిశుభ్రతను స్వయంగా తనిఖీ చేశారు. చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, తాగునీరు, వైద్య సదుపాయాల నాణ్యతను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సంస్థలోని అడ్మిషన్ రిజిస్టర్లు, పిల్లల హాజరు, ఆరోగ్య రికార్డులను ఆమె పరిశీలించి, రికార్డుల నిర్వహణపై పలు సూచనలు చేశారు. దత్తత మరియు న్యాయ చట్టపరంగా దత్తతకు అర్హులైన చిన్నారుల ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే, చిన్నారులకు అవసరమైన ఆధార్ కార్డులు, ఇతర గుర్తింపు పత్రాలను త్వరగా ఏర్పాటు చేసి, వారికి ప్రభుత్వ ఫలాలు అందేలా చూడాలని సూచించారు. కార్యదర్శి అరుణకుమారి చిన్నారులతో సరదాగా గడిపి, వారి చదువు, ఇతర అవసరాల గురించి అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది పిల్లల పట్ల తల్లిదండ్రుల వలె ప్రేమతో ఉండాలని, వారి మానసిక వికాసానికి తోడ్పడాలని కోరారు. వర్షాకాలం దృష్ట్యా చిన్నారుల ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ప్రాంగణంలో వ్యాధులు ప్రబలకుండా తగిన శానిటేషన్ జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనాథ, నిరాశ్రయులైన చిన్నారులకు చట్టపరమైన రక్షణ, సామాజిక భద్రత కల్పించడంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని ఈ సందర్భంగా అరుణకుమారి పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో శిశు విహార్ సూపరింటెండెంట్, సిబ్బంది, జిల్లా న్యాయ సేవా ధికారా సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

బడా కంపెనీలే లక్ష్యంగా ‘వాట్సాప్’లో కొత్త తరహా మోసం

-సిపి సజ్జనార్ కీలక హెచ్చరిక

హైదరాబాద్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : వ్యాపార సంస్థల అధినేతలు, సీఈఓలు, సీఎఫ్ఓలే లక్ష్యంగా సైబర్ నేరగాళ్ల సరికొత్త వాట్సాప్ మోసాలకు పాల్పడుతున్నారని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్ తెలిపారు. సంస్థల అధికారిక ఈమెయిల్స్‌కు హానికరమైన ఫిషింగ్ లింకులు పంపడం ద్వారా కంప్యూటర్లలోకి మాల్వేర్‌ను ప్రవేశపెడుతున్నారని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల సిస్టమ్స్‌పై నేరగాళ్ల పూర్తిస్థాయి రిమోట్ యాక్సెస్‌ను పొందుతూ అక్రమాలకు తెరలేపుతున్నారని చెప్పారు. సిస్టమ్ నియంత్రణలోకి వచ్చిన తర్వాత అందులో యాక్టివ్‌గా ఉన్న వాట్సాప్ వెబ్ సెషన్లను నేరగాళ్లు చాకచక్యంగా వినియోగిస్తున్నారని అన్నారు. సీఈఓ లేదా సీఎఫ్ఓల పేరుతో అకౌంటెంట్లకు తప్పుదారి పట్టించే సందేశాలను పంపిస్తూ నమ్మిస్తున్నారని తెలిపారు. తాము అత్యవసర సమావేశంలో ఉన్నామని, ఫోన్ ఎత్తడం వీలుపడదని చెబుతూ కోట్లాది రూపాయలు కాజేస్తున్నారని పేర్కొన్నారు. సోషల్ ఇంజనీరింగ్ వ్యూహాలతో తక్షణమే తమ ఖాతాలకు డబ్బును బదిలీ చేయించుకుంటున్నారని చెప్పారు. పై అధికారుల నంబర్ల నుంచే సందేశాలు వస్తుండటంతో అకౌంటెంట్లు కూడా నిజమేనని నమ్మి మోసపోతున్నారని అన్నారు. ఇటీవల హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఇటువంటి కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. ప్రతి కంపెనీ కూడా ఇటువంటి సైబర్ దాడుల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాట్సాప్‌లో పై అధికారుల పేరుతో వచ్చే ఆర్థిక అభ్యర్థనలను గుడ్డిగా నమ్మకూడదని పేర్కొన్నారు. వెంటనే అధికారులకు నేరుగా ఫోన్ చేసి ఆ సందేశం నిజమేనా కాదా అని ధృవీకరించుకోవాలని చెప్పారు. ఆఫీసు సిస్టమ్స్‌లో నాణ్యమైన ఫైర్‌వాల్స్ మరియు యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్‌లను నిరంతరం అప్‌డేట్ చేసి ఉంచాలని అన్నారు. వాట్సాప్ వెబ్ వాడిన ప్రతిసారి తప్పకుండా లాగౌట్ చేయడం మర్చిపోవద్దని తెలిపారు. సాంకేతిక భద్రతా ప్రమాణాలను పాటించడం ద్వారానే ఇటువంటి దాడులను ఎదుర్కోగలమని పేర్కొన్నారు. ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని సజ్జనర్ చెప్పారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా జాగ్రత్త వహించాలని ఆయన తెలిపారు.

మామిడి పండ్లు కాదు, విష గుళికలు..కల్తీ ముఠా గుట్టురట్టు

-నిందితులపై కేసులు నమోదు ..గోదాంల సీజ్

కార్వాన్, ఏప్రిల్4 (ప్రభాతవార్త)

చూడటానికి నిగనిగ లాడుతూ తి నాలనిపించే మామిడి పండ్లు నిజానికి విషపూరితమైనవని తేలిం ది. నగరంలోని ప్రము ఖ మార్కెట్ల నుంచి మామిడి కాయల ను కొనుగోలు చేసి కృత్రిమంగా ఐదు రోజులకు పండాల్సిన పండ్లను ఇథలిన్ రసాయ నం ఉపయోగించి కేవలం ఒక్క రోజులోనే పక్వానికి తెస్తున్నట్లు పోలీసులు గుర్తించా రు. పండ్లను మగ్గిస్తున్న గోదాములపై టాస్క్ ఫోర్స్ పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించగా మామిడి కాయలను రసాయనాలతో బలవంతంగా పండిస్తున్నట్లు గుర్తిం చారు. ఆసిఫ్ నగర్ హుడా కాలనీలో జాన్ పాషా, అఖిల్ అలీ ఖాన్ నిర్వహిస్తున్న గోదాంలో 600ట్రేలు, టప్పాచబు త్రలో జమీల్, ఫరీద్ వద్ద 350 ట్రేల రసాయన మామిడి పండ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రంజిత్ తెలిపారు. ఇలాంటి రసాయనాలతో పండిన పండ్లు తినడం వల్ల వాంతులు, విరేచనాలు, గ్యాస్ట్రిక్ సమ స్యలతో పాటు క్యాన్సర్ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. నిందితులపై కేసులు నమోదు చేసి గోదాము లను సీజ్ చేశారు. ప్రజారోగ్యానికి హాని కలి గించేలా ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నార్సింగి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : గుర్తు తెలియని మృతదేహంను శనివారం నార్సింగి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గండిపేట మండలం ఖానాపూర్ గ్రామ సర్వే నెంబర్ 65.లో ఉన్న చెట్ల పొదలలో గుర్తు తెలియని పురుష మృతదేహం ఉందని స్థానికులు గుర్తించి 100.కు ఫోన్ చేశారు. సమాచారం అందుకున్న నార్సింగి పెట్రోలింగ్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కుళ్లిపోయిన మృతదేహంను ముళ్లపొదలలో నుంచి బయటకు తీశారు. మృతుడు 10.రోజుల క్రితం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని, 30-35. సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉంటాడని, మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే నేరుగా నార్సింగి పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

నిమ్స్‌లో మహిళలకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం

డాక్టర్ నగరి బీరప్ప

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త: పంజాగుట్టలోని నిమ్స్ ఆసుపత్రిలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా, ఆసుపత్రి పరిపాలన విభాగం ఆధ్వర్యంలో మహిళల కోసం ఈ నెల 7న ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్, కౌన్సెలింగ్, అవగాహన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు. శిబిరంలో భాగంగా బ్రెస్ట్ క్యాన్సర్, గర్భాశయ గర్భద్వార క్యాన్సర్‌పై దృష్టి సారించనుందని, నిమ్స్‌లోని రేడియేషన్ ఆంకాలజీ, మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, గైనకాలజీ, రేడియాలజీ విభాగాల నిపుణులు పాల్గొని సేవలు అందిస్తారన్నారు. ఈ శిబిరం ద్వారా మహిళల ఆరోగ్యంపై దృష్టి, క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించడం, నిపుణుల వైద్య సలహాలు, నివారణ చర్యలపై అవగాహన, లక్షణాలు, చికిత్సలపై మార్గదర్శనం నిర్వహిస్తామన్నారు. మహిళలకు స్క్రీనింగ్, గైడెన్స్, కౌన్సెలింగ్ అందిస్తారని ఆయన తెలిపారు. నిమ్స్ ఆంకాలజీ బ్లాక్‌లోని రేడియేషన్ ఆంకాలజీ వేయిటింగ్ హాల్‌లో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ శిబిరం ఉంటుందన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ముందస్తు గుర్తింపు ద్వారా మెరుగైన ఆరోగ్య ఫలితాలను పొందాలని డైరెక్టర్ పిలుపునిచ్చారు.

కొలన్ హన్మంత్ రెడ్డిని కలిసిన జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు

హన్మంత్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

నిజాంపేట్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని మెడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీకి నూతనంగా నియమితులైన సభ్యులు శనివారం కలిశారు. పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఆమోదంతో, డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ నాయకత్వంలో ఈ నియామకాలు జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా సెక్రటరీలు మొహమ్మద్ జాకీర్, సంతోష్ ముదిరాజ్ లను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారానికి సమిష్టిగా పనిచేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖైరతాబాద్‌లో వీధిదీపం కోసం ఆందోళన

ఖైరతాబాద్, ఏప్రిల్ 4 (ప్రభాతవార్త):

ఖైరతాబాద్ మారుతీనగర్ ఎంట్రన్స్ వద్ద ఉన్న కమ్యూనిటీ హాల్ సమీపంలో మూడు వారాలుగా వీధి దీపం లేకపోవడం స్థానికుల్లో ఆందోళనకు గురిచేస్తోంది. ప్రాంతంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాలు మారినా, మౌలిక సదుపాయాలపై నిర్లక్ష్యం కొనసాగుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మూడు వారాలుగా వీధి దీపం అమర్చకపోవడం శోచనీయం అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో చీకటి కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతూ, భద్రతపై కూడా భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే వీధిదీపం ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సమస్య అధికారుల దృష్టికి వెళ్లినా ఎందుకు పరిష్కారం కాలేదని ప్రశ్నిస్తున్నారు.

26న స్ఫూర్తి మెగా డ్యాన్స్ ఫెస్ట్-2026'

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాట్య గురువులు

సైఫాబాద్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: స్ఫూర్తి మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రపంచ నృత్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 26వ తేదీన బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య కళా నిలయం, మెయిన్ హాల్‌లో 'స్ఫూర్తి మెగా డ్యాన్స్ ఫెస్ట్–2026' నిర్వహిస్తున్నామని అకాడమీ డైరెక్టర్ ఇ.సూర్యతేజ సుబ్రాంత్ మాస్టర్, అధ్యక్షుడు లయన్ ఇఎస్ సూర్యనారాయణ మాస్టర్ తెలిపారు. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారితోపాటు నాట్యగురువులు డా.గీతాలత, డా.ప్రతిభరాజుగౌడ్, ఝాన్సీ, మనస్విత, లయన్ పి.ఉమాశంకర్‌రెడ్డి తదితరులు ఈ మెగా డ్యాన్స్ ఫెస్ట్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కూచిపూడి, భరతనాట్యం, కథక్, పేరిణి నాట్యం, దేశభక్తి , జానపద, సినిమా, వెస్ట్రన్ డ్యాన్స్ కళాకారుల నాట్య ప్రతిభను ప్రోత్సహించడానికి నాట్య కళాకారులచే సోలో, డ్యూయేట్, డబుల్స్, గ్రూప్ డ్యాన్స్‌ల ప్రదర్శనలను 26వ తేదీ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ ఫెస్ట్ జరుగుతుందని వారు వివరించారు. 6 సంవత్సరాల వయస్సు గలవారి నుంచి 60 ఏళ్ళ వయస్సు గల కళాకారులు ఈ ఫెస్ట్‌లో పాల్గొనవచ్చునన్నారు. ఈ డ్యాన్స్‌లో పాల్గొన్న ప్రతి కళాకారులకు నటరాజు మెమోంటో, పార్టిసిపేషన్ సర్టిఫికేట్, గోల్డ్ మెడల్ (గోల్డ్ కోటెడ్) ప్రదానం చేస్తామన్నారు. నాట్య గురువులకు నాట్య గురురత్న పురస్కారం–2026, పిల్లలకు, వారి తల్లిదండ్రులను కూడా ఘనంగా సత్కరిస్తామన్నారు. ఈ డ్యాన్స్ ఫెస్ట్‌లో పాల్గొనదలిచిన వారు ఈ నెల 10వ తేదీ లోగా 9652347207లో సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని వారు కోరారు.

అఖిలభారత వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గం నియామకం

నూతన ఎన్నికైన వారితో దండుగుల మైసయ్య, వేముల లక్ష్మణ్ తదితరులు

హైదరాబాద్, ఏప్రిల్ 4,ప్రభాతవార్త: అఖిలభారత వడ్డెర సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు దండుగుల మైసయ్య రాష్ట్ర కార్యవర్గాన్ని నియమించారు. తెలంగాణ మహిళా అధ్యక్షురాలుగా బోదాసు మాధవి ని నియమించడం జరిగినది. అదే విధంగా తెలంగాణ రాష్ట్ర సెక్రటరీ ఆలకుంట్ల రాజమ్మను నియమించారు. అలాగే గ్రేటర్ హైదరాబాద్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పల్లపు సారంగపాణి, సూర్యాపేట్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ కొంచెం యాదగిరి, సూర్యాపేట జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్ గుంజి ఉస్నార్, మేడ్చల్ జిల్లా కార్మిక అధ్యక్షుడిగా గోపాల్‌ని నియమించడం జరిగినది అలాగే కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్ సర్కిల్‌కు అధ్యక్షుడిగా సురేష్‌లుగా నియమించారు. ఈకార్యక్రమంలో అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం, ప్రెసిడెంట్ వేముల లక్ష్మణ్, జాతీయ మహిళా ప్రెసిడెంట్ తిరుమల లక్ష్మణ్ వేముల, నేషనల్ సెక్రటరీ వరికుప్పల శ్రీనివాస్ నేషనల్ సెక్రటరీ మొక్కల శేఖర్, యూత్ ప్రెసిడెంట్ వేముల లోకేష్ , రాష్ట్ర లీగల్ సెల్ అడ్వైజర్ వేముల శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ మంజుల అన్నమయ్య, రాష్ట్ర సెక్రటరీ గోగుల స్వామి . తెలంగాణ రాష్ట్ర యూత్ జనరల్ సెక్రటరీ సంపంగి వెంకటేష్, యూత్ వైస్ ప్రెసిడెంట్ వల్లపు వెంకటేష్‌లు హాజరయ్యారు

ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యం : ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద

నిజాంపేట్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త

జిహెచ్ఎంసి నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని కాలనీలలో జరుగుతున్న అభివృద్ధి పనులను బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మధురానగర్‌లో శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలో పాదయాత్ర నిర్వహించి స్థానిక ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారంపై చర్చించారు. ఈ పర్యటనలో రోడ్ల నిర్మాణం, మరమ్మత్తులు, పారిశుద్ధ్య నిర్వహణ, దోమల సమస్య, వీధి దీపాల మరమ్మత్తులు, మంజీరా నీటి డ్రైనేజర్, స్మశాన వాటికల అభివృద్ధి, సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్ల నిర్వహణ, వెజ్, నాన్ వెజ్ మార్కెట్ల ఏర్పాటు, చెరువుల సుందరీకరణ వంటి అంశాలపై సమీప కాలనీల వాసులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులతో పాటు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. గత 12 సంవత్సరాలలో కోట్లాది రూపాయల నిధులతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కూడా అభివృద్ధి పనులు మరింత వేగవంతం చేస్తామని చెప్పారు. గ్రామ పంచాయతీ స్థాయి నుండి కార్పొరేషన్ స్థాయికి, నేడు జిహెచ్ఎంసి విలీనంతో నిజాంపేట్ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందని, పెరుగుతున్న జనాభా, పట్టణీకరణకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేసి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఉప కమిషనర్ సాబెర్ అలీ, ఇంజనీరింగ్ ఏఈ ప్రవీణ్ కుమార్, ఎస్.డబ్ల్యూ.ఎం శరన్ తేజ, నిజాంపేట్ సర్కిల్‌కు చెందిన వివిధ విభాగాల అధికారులు, కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పూలే జయంతిని కూడా ఘనంగా నిర్వహించాలి : జాజుల శ్రీనివాస్‌గౌడ్

సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

సైఫాబాద్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: ఏప్రిల్ 14వ తేదీన రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ప్రభుత్వం ఏ విధంగా నిర్వహిస్తున్నదో ఆదే విధంగా అంబేద్కర్ గురువైన మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతిని కూడా ఈ నెల 11వ తేదీన నిర్వహించాలని బిసి జెఎసి రాష్ట్ర ఛైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం బిసి జెఎసి కార్యాలయంలో ఆర్టీసీ బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.తిరుపతయ్య ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీలో 28 వేల మంది బిసి ఉద్యోగులు పనిచేస్తూ ప్రయాణికులకు విశేషమైన సవలు అందిస్తున్నారని చెప్పారు. 11న పూలే జయంతి సందర్భంగా ఆర్టీసీ కళాభవన్‌లో పెద్ద ఎత్తున పూలే జయంతిని నిర్వహించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, ఆర్టీసీ ఎండికి విజ్ఞప్తి చేసినప్పటికి గతంలో లాగానే ఇమ్లీ వన్ బస్ స్టేషన్ వద్ద పూలే జయంతి నిర్వహించాలని ఎండి ఉత్తర్వులు ఇవ్వడాన్ని ఆయన తప్పుపట్టారు. రాష్ట్ర ప్రభుత్వానికి బిసిలపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్న అంబేద్కర్ జయంతి వలే పూలే జయంతిని కూడా ఘనంగా, వైభవంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బస్ భవన్ ముట్టడించడానికి ఏ మాత్రం వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో బిసి నేతలు గుజ్జ కృష్ణ, కుల్కచర్ల శ్రీనివాస్‌ముదిరాజ్, ఆర్టీసీ బిసి ఉద్యోగుల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.వెంకటేష్‌గౌడ్, గద్దం యాదగిరి, ఉపేందర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిదర్శనం.. మాజీ కార్పొరేటర్ పావనికి ఘన సన్మానం

గాంధీనగర్ మాజీ కార్పొరేటర్ ఎ. పావని వినయ్ కుమార్‌లను సత్కరించిన దృశ్యం

చిక్కడపల్లి ఏప్రిల్ 4 (ప్రభాతవార్త): గాంధీనగర్ డివిజన్ పరిధిలోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్ సమీపంలో గల భాగ్యనగర్ కాంప్లెక్స్, సుదర్శన్ ఎలైట్ అపార్ట్‌మెంట్ వాసులు మాజీ కార్పొరేటర్ ఎ. పావని వినయ్ కుమార్ లను శనివారం ఘనంగా సన్మానించారు. గత పాతికేళ్లగా పరిష్కారానికి నోచుకోని స్థానిక సమస్యలను ప్రత్యేక చొరవతో పరిష్కరించినందుకు గాను నివాసితులు కృతజ్ఞత సభఏర్పాటు చేశారు. మెట్రో స్టేషన్ నిర్మాణానికి ముందు నుంచే పెండింగ్‌లో ఉన్న వీధి అభివృద్ధి పనులను కార్పొరేటర్ తన హయాంలో పూర్తి చేయించారు. సుమారు రూ. 22 లక్షల జీహెచ్ఎంసీ నిధులతో నూతన సి.సి. రోడ్డు నిర్మాణం, స్ట్రీట్ లైట్ల ఏర్పాటు పనులు చేపట్టారు. ప్రస్తుతం రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్న పోకిరీల ఆటకట్టించేందుకు, చిక్కడపల్లి పోలీసులతో మాట్లాడి గట్టి నిఘా ఏర్పాటు చేస్తామని పావని వినయ్ కుమార్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ఎంతో కాలంగా ఏ నాయకుడూ పట్టించుకోని మా వీధిని మాజీ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ అభివృద్ధి చేశారు. నూతన రోడ్డు, లైటింగ్‌తో మా ప్రాంత రూపురేఖలు మారిపోయాయి" అని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్ కుమార్, పార్టీ నేతలు ఎం. ఉమేష్, సాయి కుమార్, నీరజ్, జ్ఞానేశ్వర్, సాయి తరుణ్ మరియు అపార్ట్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కళలు సామాజిక చైతన్యానికి ప్రతీకలు : కల్వ సుజాత

ప్రసంగిస్తున్న రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ కల్వ సుజాత

చిక్కడపల్లి ఏప్రిల్ 4 (ప్రభాతవార్త) : కళలు సామాజిక చైతన్యానికి ప్రతీకలు అని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత అన్నారు. శనివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లో శ్రీ వాసవి ఆర్ట్స్ , శ్రీ వాసవి లలితకళా సమితి ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నయన స్వరాలు తెలుగుహిందీ సినీ సంగీత విభావరి అత్యంత వైభవంగా జరిగింది. ముఖ్య అతిథిగా కాల్వ సుజాత ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సభలో ట్రస్ట్ అధ్యక్షులు నమశ్శివాయ, ప్రధాన కార్యదర్శి మాకం బద్రీనాథ్, కోశాధికారి పల్లేర్ల రమేష్, చీఫ్ అడ్వైజర్ డా. చింతల శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ చల్లా సుబ్బారావు, సి.ఏ. కె.చిదంబరం, జాయింట్ సెక్రటరీ బి.రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ లక్ష్మయ్య, ఫౌండర్ ట్రస్టీలు విజయ్ కుమార్ శెట్టి, ఎం. రవి గుప్తా తదితరులు ఉన్నారు. సంగీతం కళలు కేవలం వినోదానికి మాత్రమే కాకుండా, సామాజిక చైతన్యానికి , మానసిక ప్రశాంతతకు ప్రతీకలు అని కొనియాడారు. ఆర్యవైశ్యులందరు సామజిక దృక్పథంతో ముందుకు సాగాలన్నారు. వాసవి లలితకళా సమితి ట్రస్ట్ గత కొంతకాలంగా కళలను ప్రోత్సహించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండటం అభినందనీయమన్నారు. ముఖ్యంగా ఖినయన స్వరాలుఖి అనే పేరుతో కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ ఇటువంటి వినూత్న సంగీత కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం గొప్ప విషయమని ఆమె పేర్కొన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ద్వారా కళాకారులకు, సమాజంలోని నిరుపేదలకు అండగా ఉంటామని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ గాయనీ గాయకులు ముక్కంటీశ్వర్ రావు స్వరసారథ్యంలో ఆలపించిన పాత, కొత్త తెలుగు మరియు హిందీ సినీ గీతాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. ఈ కార్యక్రమంలో భాగంగా సోలిస్ ఐ కేర్ హాస్పిటల్ ప్రతినిధులు, డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ వైద్యులు డా. వి. లత, డా. సి. ఎల్. అమృతవల్లి లను సత్కరించారు. నిర్వాహకులు అతిథులను ఘనంగా సత్కరించారు.

మల్కాజ్‌గిరి నగరపాలక సంస్థలో విశ్రాంత సైనికాధికారుల సేవలు

ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పిస్తున్న విశ్రాంత సైనికాధికారి

హైదరాబాద్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: మల్కాజ్‌గిరి పట్టణాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా మార్చే లక్ష్యంతో ప్రతి ఇంటికి చేరువయ్యే విధంగా స్వచ్ఛ ఆటో చెత్త సేకరణ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సర్కిల్‌కు ఒక్కరు చొప్పున 14 మంది రిటైర్డ్ విశ్రాంత ఆర్మీ సైనికాధికారులు బాధ్యులుగా ఏర్పాటు చేశారు. వీరు స్వచ్ఛ ఆటో చెత్త సేకరణ, చెత్త నిర్వహణ, ప్రజల అవగాహన కార్యక్రమాలు మరింత క్రమబద్ధంగా కొనసాగేందుకు తోడ్పాటు అందిస్తున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రతి ఇంటిని కవర్ చేసేలా స్వచ్ఛ ఆటోలు రోజువారీగా చెత్త సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ప్రతి ఇంటి నుండి తప్పనిసరిగా చెత్తను స్వచ్ఛ ఆటోకు ఇవ్వాలనే అంశంపై విశ్రాంత సైనికాధికారులు ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. చెత్త స్వచ్ఛ ఆటోకు ఇవ్వకుండా బహిరంగ ప్రదేశాలలో వేయడం వలన కలిగే అనర్థాలను ప్రజలకు వివరిస్తున్నారు. స్వచ్ఛతా సిబ్బంది మరియు నియమిత అధికారుల పర్యవేక్షణలో అన్ని వీధులు, కాలనీలు తిరుగుతూ చెత్త సేకరణ పూర్తిగా జరిగేలా చర్యలు తీసుకుంటారు. ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా, తమ ఇంటి వద్దకే వచ్చే స్వచ్ఛ ఆటోకు చెత్తను అందించాలని తెలియజేస్తున్నారు. పూర్తి స్థాయిలో ప్రతి ఇంటి కవరేజీ సాధించడమే లక్ష్యంగా చర్యలు వీరు పని చేస్తారు. ప్రజల్లో స్వచ్ఛతపై అవగాహన పెంచేందుకు, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా, స్వచ్ఛ ఆటోకు మాత్రమే ఇవ్వాలనే సందేశాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకువెళుతున్నారు.

దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలే మేలు : జగదీశ్వర్‌గౌడ్

చందానగర్‌లో చలివేంద్రం ప్రారంభించిన జగదీశ్వర్‌గౌడ్

శేరిలింగంపల్లి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛందసంస్థలు, యువజన సంఘాలు ముందుకు రావాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. చందానగర్‌లో డివిజన్‌లో కాంగ్రెస్‌పార్టీ యువజన నాయకులు కట్ల శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని శేరిలింగంపల్లి నియోజక వర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాసేవలో కాంగ్రెస్‌పార్టీ యువజన నాయకులు ఎల్లప్పుడు ముందుంటారన్నారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు విరివిగా చలివేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలన్నారు. చందానగర్‌లో సీనియర్ కాంగ్రెస్‌పార్టీ నేత కట్ల శేఖర్‌రెడ్డి నిరంతరం ప్రజా సేవలో ఉంటూ సేవాభావంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు కృషిచేయటం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రఘునందన్‌రెడ్డి, హరి, మదు, రజన్, ఉదయ్ కిరణ్, కార్తిక్, రషీద్, ఖాజా అయాజుద్దీన్, పార్వతి, నజియా, సంతోష్‌యాదవ్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కుల వ్యవస్థపై బ్రాహ్మణ సంఘాలు తమ వైఖరి తెలపాలి

-ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు డా. గోవిందు నరేష్ మాదిగ

ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ

హైదరాబాద్, ఏప్రిల్ 4,ప్రభాతవార్త:

కుల వ్యవస్థ రద్దుకు బ్రాహ్మణ సంఘాలు అనుకూలమో, వ్యతిరేకమో తమ వైఖరిని స్పష్టం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గోవిందు నరేష్ మాదిగ డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక సంస్కర్త, పద్మశ్రీ మందకృష్ణ మాదిగపై అనుచిత వ్యాఖ్యలు చేసే నైతిక అర్హత బ్రాహ్మణ సంఘాలకు లేదని ఆయన మండిపడ్డారు. అన్ని కుల వృత్తుల్లోకి ఇతర వర్గాల వారు చేరడాన్ని స్వాగతిస్తున్న బ్రాహ్మణులు, దేవాలయాల్లో అర్చకులుగా బీసీ, ఎస్సీ, ఎస్టీలు రావడాన్ని ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. వేద పాఠశాలల్లో శిక్షణ పొంది, పౌరోహిత్యంపై అవగాహన ఉన్న ఎవరికైనా అర్చకత్వం చేపట్టే అవకాశం కల్పించాలని అన్నారు. కులం కంటే పవిత్రమైన జీవన విధానం ముఖ్యం అని తెలిపారు. శ్రీకృష్ణుడు బ్రాహ్మణుల కాళ్లు కడిగి ఆ నీళ్లను నెత్తిన చల్లుకున్నారంటూ బ్రాహ్మణ సంఘాల నేతలు చేసిన వ్యాఖ్యలు కోట్లాది మంది భక్తుల మనోభావాలను, యాదవ సమాజ ఆత్మగౌరవాన్ని దెబ్బ తీశాయని, దీనిపై వారు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు రద్దు చేయాలని మాట్లాడే బ్రాహ్మణులు, కుల వ్యవస్థను రద్దు చేయాలని ఎందుకు కోరడం లేదని ప్రశ్నించారు. దమ్ముంటే బ్రాహ్మణులు తమకు వస్తున్న ఈ డబ్ల్యూఎస్ రిజర్వేషన్లను వదులుకోవడానికి సిద్ధమా అని సవాల్ విసిరారు. దేశంలో సామాజిక సమానత్వం సిద్ధించే వరకు రిజర్వేషన్లు కొనసాగాల్సిందేనని అంబేద్కర్ ఆశయాలను గుర్తు చేశారు. మూడు దశాబ్దాల పాటు ఏ పదవి ఆశించకుండా మందకృష్ణ మాదిగ చేసిన నిస్వార్థ సేవలను గుర్తించే కేంద్ర ప్రభుత్వంపద్మశ్రీ పురస్కారంతో గౌరవించిందని తెలిపారు. బ్రాహ్మణులకు ఆపద వచ్చినప్పుడు అండగా నిలిచిన చరిత్ర మందకృష్ణ గారిదని ఆయన గుర్తు చేశారు. ఈసమావేశంలో ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సిహెచ్ సోమశేఖర్ మాదిగ, ఎంఎస్పి రాష్ట్ర కోఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి మాదిగ, జేపీ లతా మాదిగ, కొమ్ము శేఖర్ మాదిగ, టివి నరసింహా మాదిగ, దప్పు మల్లికార్జున మాదిగ తదితర ఎంఎస్పి, ఎంఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

నిజాంపేట, బాచుపల్లి ప్రభుత్వ భూముల కబ్జాపై తక్షణ చర్యలు తీసుకోవాలి

వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

నిజాంపేట్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త

నిజాంపేట పరిధిలోని సర్వే నంబర్లు 233/22, 24, 25, 26, 27లో ఉన్న సుమారు 13 ఎకరాల ప్రభుత్వ భూమిపై జరుగుతున్న అక్రమ ఆక్రమణలపై తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మార్వో కార్యాలయంలో ఫిర్యాదు సమర్పించారు. సర్వే నంబర్ 233/22లో దాదాపు 3000 గజాల ప్రభుత్వ భూమిని కల్వకుంట్ల కన్నారావు ఆక్రమించి ఫెన్సింగ్ ఏర్పాటు చేసినట్లు ఆరోపించారు. అలాగే సర్వే నంబర్లు 233/24, 25, 26, 27లో ఉన్న సుమారు 13 ఎకరాల లావణ్య పట్టా ప్రభుత్వ భూమిపై కోర్టు ఉత్తర్వులు తమకు అనుకూలంగా ఉన్నాయని పేర్కొంటూ కొంతమంది ప్రైవేటు వ్యక్తులు, అధికార పార్టీ నేతల మద్దతుతో ఆదివారం ఉదయం నుండి జేసీబీలతో భూమిని చదును చేస్తున్నారని తెలిపారు. దాదాపు రూ.500 కోట్ల విలువ చేసే ఈ ప్రభుత్వ భూమిని కాపాడి, భవిష్యత్తులో మినీ స్టేడియం నిర్మాణానికి కేటాయించాలని వారు విజ్ఞప్తి చేశారు. అలాగే బాచుపల్లి పరిధిలోని సర్వే నంబర్ 454లో ప్రభుత్వ భూమిని ఆకృతి కన్స్ట్రక్షన్ సంస్థ అక్రమంగా ఆక్రమించి రోడ్డు నిర్మాణం చేపట్టిందని ఆరోపించారు. ఈ భూమిని కూడా తక్షణమే స్వాధీనం చేసుకుని ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ, ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, కోర్టు కేసుల్లో సరైన కౌంటర్ దాఖలు చేసి ప్రభుత్వ ఆస్తులను రక్షించాలని, అలాగే భూములకు ఫెన్సింగ్ వేసి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అమలేశ్వరి, సుహాసిని శక్తి, కవితా రెడ్డి, హనుమయ్య, పాండు తదితరులు పాల్గొన్నారు.

మాలల దేవాలయం కూల్చివేతలో కూటమి నాయకులు, అనుచరులపై చర్యలు తీసుకోవాలి

సైఫాబాద్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: ఎపిలోని అకివీడులో మాల కుల గ్రామ దేవత దేవాలయం కూల్చివేతకు పాల్పడి, దీనిని అడ్డుకున్న మాలలపై దారుణంగా దాడికి పాల్పడిన జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, అనుచరులను తక్షణమే అరెస్టు చేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మత విద్వేషాలకు పాల్పడి, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న డిప్యూటి స్పీకర్ రఘురామకృష్ణంరాజుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఆయన రాష్ట్ర గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సంఘటనలో 50 మంది మాలలపైన అక్రమంగా కేసులు పెట్టి అరెస్టు చేశారని, తక్షణమే వారిని విడుదల చేయాలని, బేషరతుగా కేసులు ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. శతాబ్ద కాలం నుంచి మాల కులదైవమైన గొంతేలమ్మ గుడిని కూల్చి దాని స్థానంలో శ్రీరాముని విగ్రహం పెట్టాలనుకోవడం సరైన పద్దతి కాదన్నారు. దళితుల ఆత్మగౌరవంపై దాడులు చేస్తున్న కూటమి పార్టీల నాయకులను కట్టడి చేయకపోతే దళితుల నుంచి ప్రతిఘటన తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ దాడుల వెనుక ఆర్ఎస్ఎస్ హస్తం ఉందని, 350 దళిత కుటుంబాల ఇళ్లను రఘురామకృష్ణంరాజు కూల్చివేశారని, ఈ విషయంపై జాతీయ మానవ హక్కుల కమీషన్ బృందం విచారణ చేపట్టాలని కోరారు. ఈ నెల 10న జాతీయ మానవ హక్కుల కమీషన్‌లో విచారణ జరగన్నుదని ఆయన తెలిపారు.

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

: బేగంబజార్ సిఐ భరత్‌కుమార్

సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్.ఐ నర్సింహ్మా

బేగంబజార్, ఏప్రిల్ 4ప్రభాతవార్త:

పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు గాను అనునిత్యం ప్రజలను అప్రమత్తం చేయడం జరుగుతుందని బేగంబజార్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.భరత్‌కుమార్ అన్నారు. నగర పోలీసు కమీషనర్ సి.వి సజ్జన్నార్ ఆదేశాల మేరకుగోల్కొండ జోన్ డిసిపి చంద్రమోహన్ ఆధ్వర్యంలో గోషామహల్ ఎసిపి ఎస్.సుదర్శన్ పర్యవేక్షణలో శనివారం బేగంబజార్ పోలీసులు ప్రజలను కలిసి సైబర్ నేరాలను కరికట్టేందుకుగానుఅవగాహన కల్పిస్తూ, అప్రమత్తం చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా గుర్తు తెలియనినెంబర్ల నుంచి ఫోన్ చేసి మీకు లాటర్లీ వచ్చాయని, పేరుమీద లోన్ మంజూరైందని, లేక క్రెడిట్‌కార్డులు మంజూరైనట్లు సైబర్ నేరాగాళ్లు నమ్మిస్తారని, వారి మాటల ఉచ్చులో పడి (ఓటిపి)లు చెప్పవద్దని సూచించారు. దురాశకు ఆశపడితే మీ బ్యాంకులో ఉన్న డబ్బులు పోతాయని ప్రజలనుహెచ్చరిస్తూ, అప్రమత్తం చేశారు. తరుచుగా ఫోన్ చేసి వేధించే వారిపట్ల అప్రమత్తంగా ఉండి వెంటనే 108 ఫోన్ చేయాలని సూచించారు. ప్రజలు కూడా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ అడ్వైజర్‌గా కొటికే విఠల్ నియామకం

చిక్కడపల్లి ఏప్రిల్ 4 (ప్రభాతవార్త) :

వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ అడ్వైజర్‌గా నగరానికి చెందిన ప్రముఖ సామాజిక వేత్త కొటికే విఠల్ నియమితులయ్యారు. ఈ మేరకు మహాసభ గ్లోబల్ ప్రెసిడెంట్ రామకృష్ణ తంగుటూరి నియామక పత్రాన్ని జారీ చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్యుల అభ్యున్నతికి, సంస్థ బలోపేతానికి విఠల్ తన సేవలను అందించనున్నారు. ఈ నియామకం జూన్ 30, 2027 వరకు అమలులో ఉంటుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో ఆర్యవైశ్యులను ఏకం చేయడంలోనూ, సంస్థలో నూతన సభ్యుల నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంలోనూ ఆయన కీలక పాత్ర పోషించనున్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు కొటికే విఠల్ సంస్థ కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు విఠల్‌ను కలిసి అభినందనలు తెలియజేశారు.

అభివృద్ధి పనుల్లో రాజీ ప్రసక్తే లేదు : బండి రమేష్

కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 4, ప్రభాతవార్త

అభివృద్ధి పనుల విషయంలో ఎక్కడా రాజీ పడబోమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ పేర్కొన్నారు. శనివారం అయన స్థానిక నాయకులతో కలిసి నియోజకవర్గంలోని అభివృద్ధి పనుల విషయమై జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను కలిశారు. ఇప్పటికే ప్రారంభమై కొనసాగుతున్న పనులతో పాటు జేఎన్టీయూ చౌరస్తా వద్ద స్కైవాక్, మూసాపేట వై జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ పనులు, సఫ్దర్ నగర్‌లోని హిందూ స్మశాన వాటిక ప్రారంభోత్సవం రాజు కాలనీలోని స్థలాన్ని కమ్యూనిటీ హాల్‌కే కేటాయించాలని, ఈఎస్ఐకి ఇవకూడదనీ రమేష్ చౌహాన్‌ను కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన ప్రారంభించాల్సిన, అనుమతి పొందిన పనులను వెంటనే ప్రారంబిస్తామని హామీ ఇచ్చారు.

సనత్ నగర్‌లో సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమం

సమావేశంలో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

సంజీవరెడ్డి నగర్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:

సంజీవరెడ్డి నగర్ పరిధిలోని సనత్ నగర్‌లో శనివారం జూబ్లీహిల్స్ జోన్ డీసీపీ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సైబర్ క్రైమ్ డీసీపీ అరవింద్ బాబు, రమణారెడ్డి హాజరయ్యారు. సనత్ నగర్‌లోని ఎలికో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజలకు సైబర్ నేరాలపై వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఓటీపీలు, పాస్‌వర్డ్‌ల భద్రత, బ్యాంకింగ్ మోసాలు, ఇంటర్నెట్ వినియోగంలో జాగ్రత్తలు, జాబ్ ఫ్రాడ్స్, ఏపికె ఫైళ్ల ద్వారా జరిగే మోసాలు, గేమింగ్, సోషల్ మీడియా మోసాల గురించి వివరించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులు లేదా కాల్స్‌పై స్పందించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సనత్ నగర్ ఇన్స్పెక్టర్ అశోక్, పోలీస్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

యువకుడిపై గ్యాంగ్ దాడి

అత్తాపూర్ ఏప్రిల్ 4,ప్రభాతవార్త :

అత్తాపూర్ లో జహూర్ ఇక్బాల్ గ్యాంగ్ రెచ్చిపోయింది. సద్దాం అనే యువకుడిని బైక్ పై కిడ్నాప్ చేసి చింతల్ మెట్ ప్రాంతానికి తీసుకువచ్చారు. అనంతరం అతడిపై విచక్షణారహితంగా కర్రలతో చితకబాది తీవ్రంగా గాయపరిచి పారిపోయారు. అందరూ చూస్తుండగానే దాడికి పాల్పడ్డడంతో ఒక్కసారిగా స్థానికులు భయభ్రాంతులకు గురైయ్యారు. గ్యాంగ్ దాడిలో తీవ్రంగా గాయపడిన సద్దాంను స్థానికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న అత్తాపూర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకునే లోపే దాడికి పాల్పడిన గ్యాంగ్ పారిపోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకున్న పోలీసులు సిసికెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

మహిళపై భార్యభర్తల దాడి

సికింద్రాబాద్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: భార్యభర్తలు ఇంట్లోకి చొరబడి ఓ మహిళపై దారుణంగా దాడి జరిపారు. అంతే కాకుండా చొరబడ్డ వ్యక్తి ఆ మహిళపై లైంగిక దాడికి ప్రయత్నించాడని బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ సంఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. గంగపుత్ర కాలనీలో ఓ మహిళ (30) భర్తతోతో కలిసి నివసిస్తోంది. భర్త రాంనగర్‌కు చెందిన రాజుతో జులాయిగా తిరుగుతున్నాడు. ఇటీవల బాధిత మహిళ తల్లి రాజుకు ఫోన్‌చేసి నా అల్లుడితో ఎందుకు తిరుగుతున్నావని మందలించింది. దీంతో రాజు, అతని భార్యతో కలిసి బాధిత మహిళ ఇంటికి వచ్చి దాడి జరిపారు. అంతే కాకుండా భార్య ప్రోత్సాహంతో లైంగిక దాడికి ప్రయత్నించాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కులం పేరుతో దూషించిందని అట్రాసిటీ పెట్టినట్లు పోలీసులు తెలిపారు.

భూలక్ష్మి ఆలయంలో టిడిపి నేతల ప్రత్యేక పూజలు

భూలక్ష్మి దుర్గాదేవి ఆలయంలో నిర్వహించిన కళ్యాణోత్సవంలో పాల్గొన్న టీడీపీ నేతలు

ముషీరాబాద్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త: నారాయణగూడలోని భూలక్ష్మి దుర్గాదేవి ఆలయంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం దేవాలయంలో జరిగిన పార్వతీ పరమేశ్వరుల కళ్యాణోత్సవంలో పాల్గొన్న నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, ప్రదీప్‌గౌడ్, యాదగిరిగౌడ్, శ్యామ్, కిరణ్‌కుమార్, టి.వినోద్, శుక్రవేది, యాదగిరి, ఆనంద్‌లకు వేదపండితులు వేదాశీస్సులు అందించారు. తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆనందంగా ఉండాలని, తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతం కావాలని వారు అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు.

పేదలు సిఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్

మెరుగైన వైద్యానికి ఎల్.ఓ.సీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

అడ్డగుట్ట, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: పేద ప్రజలు కార్పోరేట్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం చేయించుకునేందుకు ముఖ్య మంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. కంటోన్మెంట్ నియోజకవర్గం బాలంరాయి, అన్నా నగర్‌కు చెందిన యాదగిరి 4 లక్షలు, రసూల్ పురకు చెందిన భరత్‌కు రూ. 2 లక్షలు, బోయిన్‌పల్లికి చెందిన ఎండి సలీమ్ 2.50 లకు మంజూరై. 8.50 లక్షల ఎల్ఓసీ మంజూరు పత్రాలను శనివారం పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బాధిత కుటుంబాలకు అందజేశారు.

భగవంతున్ని వేడుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయి : ఎమ్మెల్యే మైనంపల్లి

తాడ్‌బండ్ హన్‌మాన్ దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మార్కెట్ చైర్మన్ ఆనంద్ బాబు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి తదితరులు

కంటోన్మెంట్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: భగవంతున్ని వేడుకుంటే కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావ్‌లు తెలిపారు. సికింద్రాబాద్ తాడ్‌బండ్‌లో ప్రసిద్ధిగాంచిన శ్రీ హన్‌మాన్ దేవాలయంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలకు ఖరు ముఖ్య అతిథిగా హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను బోయిన్‌పల్లి మార్కెట్ చైర్మన్ ఆర్. ఆనంద్ బాబు గౌడ్, ఆలయ ఈఓ నరేందర్‌లు శాలువకప్పి తీర్థప్రసాదాలను అందజేసి ఘనంగా సత్కరించారు.

రిషబ్ జంటను ఆశీర్వదించిన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

నూతను జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్న రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, వివిధ పార్టీల నేతలు, అధికారులు

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 4, ప్రభాతవార్త : భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఊరేగింపు కమిటీ మాజీ అధ్యక్షులు, సుల్తాన్‌షాహి శ్రీ జగదాంబ దేవాలయ కమిటీ చైర్మన్ రాకేష్ తివారి కనిష్ఠ పుత్రుడు డాక్టర్ రిషబ్ వివాహ మహోత్సవం శుక్రవారం రాత్రి నగర శివారుల్లోని ఒక కన్వెన్షన్లో అత్యంత వైభవంగా జరిగింది. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, వేదపండితులు కాకునూరి సూర్యనారాయణమూర్తి నేతృత్వంలోని అర్చక స్వాముల బృందం వేదమంత్రాల మధ్య వరుడు డాక్టర్ రిషబ్, వధువు డాక్టర్ సుష్మ మెడలో వరమాల వేసి జంటగా కొత్త జీవితంలోకి అడుగు పెట్టారు. వధువరుల తరపు బంధువులు, స్నేహితులు వారిని అభినందించారు. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, మాజీ ఎంపి ఎం.అంజన్ కుమార్ యాదవ్, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్‌జీ, మాజీ కార్పొరేటర్, ఎంబిటి నేత అమ్జదుల్లా ఖాన్, వివిధ పార్టీల నేతలు, ఆలయాల చైర్మన్లు, అధికారులు నూతన జంటకు పుష్పగుచ్ఛం అందజేసి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వరుడి తల్లిదండ్రులు సుమన్ తివారి, రాకేష్ తివారి, వధువు తల్లిదండ్రులు కొత్త జ్యోతి, కొత్త శ్రీనివాసరావు, పెద్ద సంఖ్యలో బంధువులు పాల్గొన్నారు.

శాలిబండ మురాద్‌మహల్‌లో అగ్నిప్రమాదం

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 4, ప్రభాతవార్త : మొఘల్‌పురా పోలీసుస్టేషన్ పరిధిలోని శాలిబండ మురాద్‌మహల్లో ఇళ్ళ మధ్య గల ఒక ఖాళీ ప్లాటులో పోగైన చెత్తా చెదారానికి శనివారం మధ్యాహ్నం ఉన్నఫళంగా మంటలంటుకున్నాయి. దట్టమైన పొగలు రావటంతో ఆందోళన చెందిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఇన్‌స్పెక్టర్ సి.శ్రీను తన సిబ్బందితో అక్కడికి చేరుకొని మంటలు మరింత వ్యాపించకుండా స్థానికుల ఇళ్ళలోని బోరింగ్ నీటితో అగ్నిని అదుపు చేసే ప్రయత్నం చేశారు. ఈలోగ మొఘల్‌పురా ఫైరింజన్‌ను రప్పించారు. అగ్నిమాపక సిబ్బంది ఖాళీ స్థలంలోని ఎండిపోయిన పిచ్చిమొక్కలు, చెత్తాచెదారానికి అంటుకున్న మంటలను అదుపు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సి.శ్రీను మాట్లాడుతూ ఎండా కాలంలో అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉన్నందున ఖాళీ స్థలాలలో యజమానులు శుభ్రంగా పెట్టుకోవాలని, జనవాసాల మధ్య గల స్క్రాప్ గోదాములలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద చెత్తా చెదారం వేయవద్దని తద్వారా అగ్నిప్రమాదాలు సంభవించి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగటంతో పాటు ప్రమాదవశాత్తు మూగజీవులు బలైయ్యే అవకాశం ఉందన్నారు.

ఇంటి నిర్మాణం విషయంలో ఘర్షణ..

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 4, ప్రభాతవార్త : ఇంటి నిర్మాణం విషయంలో యజమానికి, కిరాయిదారునికి మధ్య జరిగిన గొడవపై ఫలక్‌నుమా పోలీసు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఇ.జంగయ్య కథనం ప్రకారం...ఫాతిమనగర్‌కు చెందిన అస్గర్ హుస్సేన్ ఇంట్లో ఖయ్యూం అనే వ్యక్తి కుటుంబంతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. కిరాయి ఇంట్లో ఉంటూ ఆ పక్కనే సొంత ఇల్లు కట్టుకున్నాడు. అయితే ఇంటి నిర్మాణం విషయంలో అస్గర్ హుస్సేన్‌కు, ఖయ్యూంకు మధ్య చిన్న గొడవ జరిగింది. ఆ సమయంలో ఖయ్యూం దూషించాడు. ఆగ్రహించిన హుస్సేన్ అతనిపై చెయి చేసుకున్నాడు. ఖయ్యూం నిర్మిస్తున్న ఇంటి నుండి కొద్ది దూరంలో ఉండే మరో ఇంట్లో హుస్సేన్ కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. విషయం తెలుసుకున్న ఖయ్యూం కుటుంబ సభ్యులు హుస్సేన్ నివసిస్తున్న ఇంటికి వెళ్ళి ప్రతిదాడి చేశారు. ఈ సంఘటనపై అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య : డిప్యూటీ ఐఓఎస్ విశ్వనాథం గుప్త

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 4, ప్రభాతవార్త : విద్యార్థులకు శారీరిక వ్యాయామం, బౌద్ధిక ప్రదర్శనలు మానసికోల్లాసాన్ని, ఆనందాన్నిస్తాయని బండ్లగూడ మండల ఉప పర్యవేక్షణాధికారి డాక్టర్ జి.విశ్వనాథం గుప్త అన్నారు. శనివారం బేలా చందూలాల్ ప్రభుత్వ బాలుర ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం లలితాబాగ్, లలితాంబ దేవాలయ మైదానంలో జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ ఐఓఎస్ విశ్వనాథం గుప్త మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ఉచితంగా ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం, రాత, పాఠ్యపుస్తకాలు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలల మాదిరి వేలకు వేల రూపాయల ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి నాణ్యమైన, పౌష్టికాలు గల అల్పాహారం ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకొని మండలంలోనే ఉత్తమ పాఠశాలగా గుర్తింపు తెచ్చారన్నారు. పాఠశాల ఉపాధ్యాయులను, విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆ పాఠశాల ఉన్నతి కోసం పనిచేసిన పూర్వ ఉపాధ్యాయులు అనిరుధరావు సాథేను, ఇతర ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

ఉత్తమ సాంస్కృతిక ప్రదర్శనలతో బహుమతులు అందుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింభించే మేడారం సమ్మక్క సారలమ్మ జాతర, బతుకమ్మ పండుగలపై విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రదర్శనలకు అతిథులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సైదాబాద్, నాంపల్లి మండలాల డిప్యూటీ ఐఓఎస్‌లు రామ్మోహన్, లక్ష్మణ్ సింగ్, బండ్లగూడ స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం ప్రసన్నకుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె.హరి, ఉపాధ్యాయులు పి.హిందుమతి, వనజ, రాధప్యారి, సువర్ణ, సరిత, శ్రీనివాస్‌రావు, మంజుల, వెంకటరమణారావు, పీక్‌లాల్, వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతల, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉర్దూ సాహిత్యాన్ని పదిలపరుచుకోవాలి : స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

హైదరాబాద్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త

ఉర్దూ సాహిత్యాన్ని పదిలపరచుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. న్యూమల్లేపల్లిలోని అన్వర్ ఉల్ ఉలూం కళాశాల మైదానంలో 9వ నవాబ్ షా అలంఖాన్ యాద్గర్ ఆల్ ఇండియా ముషాయేరా కార్యక్రమం భారీ ఎత్తున నిర్వహించారు. అన్వర్ ఉల్ ఉలూం ఇన్‌స్టిట్యూట్ సంస్థ కార్యదర్శి నవాబ్ మహబూబ్ అలంఖాన్ అధ్యక్షతన అన్వర్ ఉల్ ఉలూం జాయింట్ సెక్రటరీ నవాబ్ ముజాహిద్ అలంఖాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి స్పీకర్ పాల్గొని మాట్లాడారు. ప్రాచీన ఉర్దూ సాహిత్య వికాసం కోసం చేస్తున్న కృషిని అభినందించారు. రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ మాట్లాడుతూ ఉర్దూ సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకుపోవడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ మాట్లాడుతూ ఉర్దూ సాహిత్యం పై సమాజానికి ఉపయోగపడే అనేక కవిత్వాలు రావాలని ఆశిస్తున్నామని చెప్పారు. మహబూబ్ అలంఖాన్ మాట్లాడుతూ ఉర్దూ సాహిత్యాన్ని దేశ నలుమూలల చేరే విధంగా గత తొమ్మిదేళ్లుగా ముషాయిరా కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇందులో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన ఉర్దూ కవులు, రచయితలు ఉర్దూ కవిత్వాన్ని సమాజానికి అందిస్తున్నారని పేర్కొన్నారు.

నవాబ్ షా అలంఖాన్ యాద్గర్ ఆల్ ఇండియా ముషాయేరా కార్యక్రమంలో పాల్గొన్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి అజారుద్దీన్, నవాబ్ మహబూబ్ అలంఖాన్, ముజాహిద్ అలంఖాన్ తదితరులు

విద్యార్థులకు కూడా ఉర్దూ సాహిత్యంపై ఆసక్తి పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు వి. హనుమంతరావు, సమాజ్ వాదీ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి రాజ్ కుమార్ బట్టి, ప్రొఫెసర్ రామ్ పునియాని, హజ్ కమిటీ చైర్మన్ కూసురూ పాషా, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎంఏ. ఫహీమ్, నాంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఫిరోజ్ ఖాన్, ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షుడు మోతె రోహిత్, పిసిసి ఉపాధ్యక్షుడు కుమార్‌రావు, పిసిసి జనరల్ సెక్రెటరీ అల్లం భాస్కర్, పిసిసి అబ్జర్వర్ అన్సారి, పిసిసి అధికార ప్రతినిధి ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ముందుంటాం

ఫిల్మ్‌నగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్‌రెడ్డి.

యూసుఫ్‌గూడ ఏప్రిల్ 4 ప్రభాతవార్త : ప్రజలు ఎదుర్కొనే సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించి వాటి పరిష్కారానికి తగిన విధంగా కృషి చేయటం జరుగుతుందని ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం ఎమ్ఆర్‌సీ కాలనీలో పర్యటించారు. బస్తీలో వీధి దీపాలు డ్రైనేజీ సమస్య అధికంగా ఉందని స్థానికులు వారి దృష్టికి తీసుకురాగా వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వెంకి ముదిరాజు, నరసింహ, లక్ష్మయ్య, భాగ్యమ్మ, మల్లేష్, శ్రీకాంత్, అజయ్, పవన్ ముదిరాజ్, చైతన్య, యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి చిత్ర ప్రదర్శన ఏర్పాటు

యూసుఫ్‌గూడ ఏప్రిల్ 4 ప్రభాతవార్త : జూబ్లీహిల్స్ లోని జూబ్లీ కన్వెన్షన్ సెంటర్‌లో ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ పేరిట ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి చిత్ర ప్రదర్శనలో ప్రముఖ జాతీయ చిత్రకారుడు నన్నుట రాజేశ్వర్ గంగపుత్ర మత్స్య సంపద వృద్ధిపై ఆర్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి వరంగల్ గంగపుత్ర, హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ టంగుటూరి రాజేష్ కన్నా గంగపుత్ర సందర్శించారు. నన్నుట రాజేశ్వర్ గంగపుత్రను శాలువతో సత్కరించారు. అనంతరం రాజేష్ కన్నా గంగపుత్ర మాట్లాడుతూ మత్స్య సంపద వృద్ధిపై ఆర్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. చిత్ర కారుడు తన చిన్ననాటి సాంప్రదాయ మత్స్యకార గంగపుత్ర మహిళలు చేపల చెరువు వద్ద తాగు నీటి కోసం బిందెలతో వచ్చి ముచ్చట్లు పెడుతున్న సన్నివేశాలు, చేపల అమ్మకాల కళా కండాలు అతడి చిత్ర కళా నైపుణ్యానికి ప్రతీకలని కొనియాడారు.

ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు లక్ష్మీనారాయణకు సన్మానం



లక్ష్మీనారాయణకు సన్మానం చేస్తున్న దృశ్యం

కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 4, ప్రభాతవార్త

ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా గెలుపొందిన అమరవాది లక్ష్మీనారాయణను శనివారం ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) రాష్ట్ర అధ్యక్షుడు మల్లిపెద్ది శంకర్, ఇతర కమిటీ సభ్యులు నేతలతో కలిసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అమరవాది లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తన గెలుపు కోసం పని చేసిన అవోపా రాష్ట్ర అధ్యక్షుడు ఇతర సభ్యులు ఇకముందు తాను చేయబోయే ఆర్యవైశ్యుల అభివృద్ధిలోను సహకరించాలన్నారు. అనంతరం అవోపా శంకర్ మాట్లాడుతూ తెలంగాణలో అవోపా ఆర్యవైశ్య మహాసభ అనుభంద సంస్థలా పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోల శ్రీధర్, జోనల్ చైర్మన్ అగీర్ అశోక్ కుమార్, రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు మనోహర్‌రావు, ప్రధాన కార్యదర్శి దుబ్బ అనిల్ కుమార్, ఫైనాన్స్ సెక్రటరీ శివకుమార్, ఆర్గనైజేషన్ సెక్రెటరీ నాగేంద్రయ్య రంగారెడ్డి జిల్లా అర్బన్ టు అధ్యక్షులు బొడ్డు శ్రీధర్, ఫైనాన్స్ సెక్రటరీ ఇడుకుల లింగయ్య, ఆర్కే పురం అధ్యక్షుడు గట్టు హరీష్, ఉపాధ్యక్షుడు దుర్గాప్రసాద్, శంకర్, పుప్పాలగూడ యూనిట్ అధ్యక్షుడు దారం వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సిఎం సహాయనిధి చెక్కులు అందజేత

కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 4, ప్రభాతవార్త

కూకట్‌పల్లి నియోజకవర్గం, ఫతేనగర్‌కి చెందిన మొహమ్మద్ సబ్బుజ్ ఖాన్, బాలనగర్ డివిజన్‌కి చెందిన పూరవీరేశం గౌడ్, మూసాపేట్ డివిజన్‌కి చెందిన పందులోలు స్వాతి, కూకట్‌పల్లికి చెందిన ులకపు వినయ్, బాలనగర్ డివిజన్‌కి చెందిన తన్నీరు అంజయ్య, మూసాపేట్ డివిజన్‌కి చెందిన మొహమ్మద్ సిరాజ్, బాలనగర్ డివిజన్‌కి చెందిన కాసుల ప్రమీల లకు దాదాపు 3 లక్షల 94 వేల రూపాయల చెక్కులు మంజూరైనవి. కూకట్‌పల్లి టిపిసిసి ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ శనివారం శ్రీ హేమ దుర్గా భవన్‌లో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు అందచేయడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, బండి రమేష్‌కి, బాధిత కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మయ్య, గాలి బాలాజీ, పుష్ప రెడ్డి, కొప్పిశెట్టి దినేష్ కుమార్, గంధం రాజు, పులి శివకుమార్ గౌడ్, గోపాల్ చౌదరి, రంగమోహన్, అక్బర్, ప్రసన్నకుమార్, మధు, మహేందర్, కలికోట బాలరాజు, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

జాండ్ర సంఘానికి అన్ని విధాలుగా అండగా ఉంటాం

- మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి

బండ్లగూడ జాగీర్ జాండ్ర సంఘం మహిళా కమిటీ సభ్యులను సత్కరిస్తున్న రాజేందర్‌రెడ్డి.

నార్సింగి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : జాండ్ర సంఘం ప్రతినిధులు సమాజ హితమైన అనేక కార్యక్రమాలు చేపడుతూ, అందరి మన్ననలు అందుకుంటున్నారని మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం జాండ్రసంఘం నూతన మహిళా సంఘం ప్రతినిధులను రాజేందర్‌రెడ్డి దంపతులు ఘనంగా సత్కరించి, అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే మే నెల చివరి వారంలో జరిగే సమస్త జాండ్ర వివాహ పరిచయ వేదికకు మావంతు పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. జాండ్ర సంఘంకు అన్ని రకాలుగా అండగా నిలుస్తామని, సహాయం చేస్తామని తెలిపారు. సమాజ వికాసానికి అందరం సమిష్టిగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. కుల, మత, వర్గ భేదాలు లేకుండా మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకునేందుకు అందరం కలిసి పని చేద్దామని రాజేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాండ్రసంఘం మహిళా ప్రతినిధులు భారతి, సునీత, అనిత, సరోజ తదితరులు పాల్గొన్నారు.

11నుంచి రామచంద్రయాదవ్ ఆమరణ నిరాహార దీక్ష



అభివాదం చేస్తున్న విజయకుమారి, వివేక్‌యాదవ్, ఆగమయ్య, ఒరుగంటి వెంకటేష్‌యాదవ్, ప్రసాద్ గౌడ్ తదితరులు

హైదరాబాద్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త: బిసిల డిమాండ్ల సాధనకు బిసివై పార్టీ అధ్యక్షులు బోడె రామచంద్రయాదవ్ ఈనెల 11న ఆంధ్రప్రదేశ్‌లోని మంగళగిరి బిసివై పార్టీ కేంద్రకార్యాలయంలో ఆమరణ నిరాహారదీక్ష చేయనున్నట్లు బిసివైపార్టీ జిహెచ్ఎంసి కన్వీనర్ విజయ్‌కుమారి తెలిపారు. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పొలిటికల్ అఫైర్ కమిటీ సభ్యులు మేకల వివేక్‌యాదవ్, ఆగమయ్య, ఒరుగంటి వెంకటేశ్ యాదవ్, అమర్ ప్రసాద్ గౌడ్ తదితరులతో కలిసి మాట్లాడారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బిసి రక్షణ చట్ట అమలు, రాజధాని ప్రాంతంలో బిసిలకు వెయ్యిఎకరాలకు కేటాయింపు, బిసి కులాలు, కార్పొరేషన్లకు నిధులు అలాగే సమగ్రకులగణన, విద్యాఉద్యోగ స్థానిక సంస్థలు, చట్టసభల్లో బిసిలకు 44 శాతం రిజర్వేషన్ల డిమాండ్‌తో ఈ ఆమరణ దీక్ష జరగుతుందన్నారు. అలాగే వచ్చే జిహెచ్ఎంసి ఎన్నికల్లో బిసివై పార్టీ అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని తెలిపారు.

అంబేద్కర్ దళిత్ స్టడీ సర్కిల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం: మంత్రి అడ్లూరి లక్ష్మణ్

యూసుఫ్‌గూడ ఏప్రిల్ 4 ప్రభాతవార్త : అంబేద్కర్ దళిత్ స్టడీ సర్కిల్‌ను ఆదర్శవంతమైన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. శనివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని రహమత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్‌లో అంబేద్కర్ దళిత్ స్టడీ భవన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా భోజనశాల, వసతిగృహ రూములు, గ్రంథాలయం, స్టడీ హాళ్లను పరిశీలించారు. దేశంలోనే ప్రత్యేకంగా నిర్మించబడిన ఈ స్టడీ భవన్ విద్యార్థులకు యువతకు ఎంతో ఉపయోగపడేలా అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పంతో పనిచేస్తుందన్నారు. ఈ సెంటర్ ద్వారా దళిత విద్యార్థులు ఉన్నత విద్యలో ముందుకు రావడానికి అవసరమైన మార్గదర్శకత్వం, సదుపాయాలు అందించబడతాయని తెలిపారు. త్వరలోనే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ భవన్ ప్రారంభం కానుందని పేర్కొన్నారు. దళిత యువత తమ ప్రతిభను నిరూపించుకునే వేదికగా ఈ స్టడీ సర్కిల్ నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి, దళిత స్టడీ సెంటర్ చైర్మన్ మల్లెపల్లి లక్ష్మయ్య, మాజీ చీఫ్ సెక్రటరీ మాధవరావు, సీనియర్ సంపాదకులు రామచంద్రమూర్తి, ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీఆర్ హిల్స్‌లోని అంబేద్కర్ దళిత్ స్టడీ సర్కిల్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్, జూబ్లీహిల్స్ శాసనసభ్యులు నవీన్ యాదవ్.

రోడ్డుపై అక్రమ డబ్బాలు, షాపుల మందున్న రేకు షెడ్లు కూల్చివేత

చార్మినార్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : హైదరాద్ పాతబస్తీలోని పలు ప్రాంతాలలో రహదారులను ఆక్రమించుకుని ఉన్న డబ్బాలు, వస్త్రాల మార్కెట్‌లో నిబంధనలకు విరుద్ధంగా షాపుల ముందు నుంచి రహదారి వరకున్న రేకుల షెడ్లు, బోర్డులను జిహెచ్ఎంసి అధికారులు తొలగించటంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఎటువంటి సమాచారం ఇవ్వకుండ ఆకస్మాత్తుగా డబ్బాలు, బట్టల షాపుల ముందున్న రేకులను కూల్చివేయటం పట్ల ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రెహ్మత్ అలీ బేగ్, మాజీ కార్పొరేటర్లతో పాటు పలువురు ఎంఐఎం నాయకులు జిహెచ్ఎంసి అధికారులు, పోలీసులతో వాదనకు దిగారు. దీంతో కొద్ది సేపు పాతబస్తీలోని ముర్గీచౌక్‌లో ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులు, జిహెచ్ఎంసి అధికారులు వారికి నచ్చజెప్పటంతో పరిస్థితి తిరిగి సద్దు మణిగింది. చార్మినార్ సమీపంలో ఉన్న ముర్గీచౌక్ క్లాక్ టవర్ వద్ద దాదాపు ఎన్నో ఏళ్ల నుంచి డబ్బాలు ఏర్పాటు చేసుకుని తాళాలు, ఇతర వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. కాగా శనివారం ఉదయం జిహెచ్ఎంసి అధికారులు ముర్గీచౌక్ క్లాక్ టవర్ చుట్టూ ఉన్న స్థలంలో అక్రమంగా ఉన్నవివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్న నలభై మూడు డబ్బాలు కూల్చి వేశారు. సమాచారం ఇవ్వకుండ ఏలా కూల్చివేస్తారని ఎమ్మెల్సీ రెహ్మత్ అలీ బేగ్ పోలీసులు, జిహెచ్ఎంసి అధికారులతో వాదనకు దిగారు. కూల్చివేతలను వెంటనే ఆపి వేయాలని ఆయన డిమాండ్ చేశారు. పోలీసులు నచ్చజెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది. ముర్గీచౌక్ నుంచి పురానాపూల్ గుడ్‌విల్ హోటల్ వరకు అక్రమ కూల్చివేతలు జరిగాయని హుస్సేనీ ఆలం ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపారు. కాగా పటేల్ మార్కెలోని వస్త్రాల షాపులు ముందురహదారిని ఆక్రమించి నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన రేకుల షెడ్లు, డబ్బాలను జిహెచ్ఎంసి అధికారులు కూల్చివేశారు. ఎన్నో ఏళ్ల నుంచి పటేల్ మార్కెట్ రహదారిని కబ్జా చేసి వ్యాపారులు రేకుల షెడ్లు దుకాణాలు ముందు ఏర్పాటు చేసుకున్నారు. పాదచారులు నడవటానికి కూడ ఇక్కడ ఇబ్బందిగా ఉండేది. శనివారం బల్దియా అధికారులు శనివారం ఉదయం మార్కెట్‌లోని సునీత టెక్స్‌టైల్స్ రహదారి నుంచి ఫత్తర్‌గట్టికి చేరుకునే రోడ్డులో ఇరు ప్రక్కల ఉన్న అక్రమ రేకుల షెడ్ల, బోర్డులను తొలగించారు. ఈ సందర్భంగా చార్మినార్ పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కూల్చివేతలలో చార్మినార్ డిఎంసి సరిత, టౌన్ ప్లానింగ్ ఏసిపి శ్రీనివాస్, చార్మినార్ పోలీసులు పాల్గొన్నారు. పాతబస్తీలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పటేల్ మార్కెలోని వస్త్రాల షాపుల ముందున్న రేకుల షెడ్లను తొలగించినప్పటి చిత్రం

ఆరోగ్యానికి మూలం ప్రకృతి సిద్దమైన శాఖాహారమే

నార్సింగి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : ప్రకృతి సిద్దమైన శాఖాహారమే ఆరోగ్యంను పెంచుతుందని బ్రహ్మశ్రీ పితామహ పత్రీజి పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ప్రతినిధులు పేర్కొన్నారు. శనివారం హైదర్షాకోట్ డివిజన్‌లోని పీరంచెరువు, కేకేనగర్, సాయిబాబా కాలనీ, శ్రీనివాస్‌నగర్, గంధంగూడ ప్రాంతాలలో శాఖాహార ర్యాలీ నిర్వహించారు. సుమారు 200. మంది ధ్యానులు ర్యాలీలో "మాంసాహారం వద్దు–శాఖాహారమే ముద్దు", ధ్యానం చేయండి ఆరోగ్యంగా ఉండడం అని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనంతరం ప్రతినిధులు మాట్లాడుతూ సర్వోన్నతమైన మానవ జన్మను పొందిన మనమంతా జీవహింసను వదిలేసి ప్రకృతి పరంగా లభించే శాఖాహారమే తీసుకుందామని పిలుపునిచ్చారు. అవని అంతటికి జ్ఞానబిక్ష పెట్టిన మనదేశం మళ్లీ విశ్వగురువుగా నిలిచేందుకు వడివడిగా పరుగులు పెడుతుందన్నారు. ప్రపంచంలో ఆధ్యాత్మికతకు నిలయం మన భారతదేశమని తెలిపారు. శ్వాసపై ధ్యాస నిలిపి ధ్యానం చేస్తే ఆయువు, ఆరోగ్యం, అందం, ఆనందం అన్నీ పెరుగుతాయన్నారు. అహింసా అంటే శాఖాహారమని, హింస అంటే మాంసాహారమని, మృత్యాహారంను సేవించిన వారు మృత్యువుకు వేగంగా దగ్గరవుతారని వివరించారు. యాంత్రిక జీవనానికి అలవాటు పడ్డ పట్టణ ప్రజలు ప్రశాంతమైన జీవనాన్ని అనుభవించేందుకు కనీసం గంట సమయం ధ్యానం చేయాలని సూచించారు.

హైదర్షాకోట్ డివిజన్‌లో శాఖాహార ర్యాలీ నిర్వహిస్తున్న పత్రీజి పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ప్రతినిధుల బృందం దృశ్యం.

మంత్రముగ్ధులను చేసిన సంజయ్ నవజనార్ధన పారిజాతం

నాంపల్లి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : సత్యభామగా అంతర్జాతీయంగా పేర్గాంచిన హాంగ్‌కాంగ్‌కు చెందిన సంజయ్‌నవపల్లి ఆంధ్రనాట్యశైలిలో ప్రదర్శించిన నవజనార్ధన పారిజాతంలోని కొంగ్రొత్త దరువులు ఆహుతులను మంత్రముగ్ధులను చేశాయి. వడపల్లి కల్చరల్, ది డ్యాన్సింగ్ బెల్స్ నృత్యసంస్థ ఆధ్వర్యంలో నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో సంజయ్ ఆంధ్రనాట్యం నేత్రపర్వంగా సభికులను తన్మయుల్ని చేసింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి, హరికథ భాగవతారిణి పద్మశ్రీ ఉమామహేశ్వరి, కళాపత్రిక సంపాదకుడు డా. మహ్మద్‌రఫీ, డా. గంధం వసవ శంకరరావులు జ్యోతిప్రకాసనంచేసి ప్రదర్శనను ప్రారంభించి సంస్థ తొలిసారి ప్రవేశపెట్టిన డాక్టర్ నటరాజ రామకృష్ణ నృత్యరత్న జాతీయ పురస్కారాన్ని కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య కళాకృష్ణను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి పురస్కారంతోపాటు 20వేల రూపాయల నగదు, జ్ఞాపిక, ప్రదానంచేసి శుభాభినందనలు తెలిపారు. ఇకనుండి ప్రతీయేటా విశిష్ట ప్రతిభ కనబరిచే నాట్యగురువును నటరాజ రామకృష్ణ నృత్యరత్న జాతీయ పురస్కారంతో సత్కరిస్తామని సంజయ్ తెలిపారు. ఈ సందర్భంగా సంజయ్ అభినవ సత్యభామగా నవజనార్ధన పారిజాతంలో విష్ణుమూర్తి మోహిని అవతారం ధరించి అమృతాన్ని దేవతలకు అసురులకు పంచిపెట్టిన ఘట్టాన్ని నవరసభరితంగా ప్రదర్శించి ఆహుతుల ప్రశంసలందుకున్నారు. డా. కళాకృష్ణ నట్టువాంగం, రమాజగన్నాథ్ గాత్రం, బి.జనార్ధన్ మృదంగం, వాసుశాస్త్రి వయోలినఖ్, దత్తాత్రేయ వేణువుతో అద్భుత వాద్యసహకారం అందించి ప్రదర్శనను మరింత రక్తికట్టించారు. చివరిగా సంజయ్ వడపల్లిని ఘనంగా సన్మానించారు.

సత్యభామ సంజయ్ నవజనార్ధన పారిజాతం లో ఒక దృశ్యం

ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా గుట్టురట్టు

-ముగ్గురు నిందితుల అరెస్ట్

గోషామహల్, ఏప్రిల్ 4ప్రభాతవార్త: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ముగ్గురు యువకులను గోషామహల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. యువతను లక్ష్యంగా చేసుకుని నిర్వహిస్తున్న ఈ బెట్టింగ్ కార్యకలాపాలపై సమాచారం అందుకున్న గోషామహల్ పోలీసులుమెరుపు దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ శ్రావణ్ కుమార్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు గోషామహల్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ప్యూచర్‌ప్లైవంటి వెబ్‌సైట్‌ల ద్వారా అక్రమంగా ఆన్‌లైన్‌బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించి ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. బతుకు దెరువు కోసం రాజస్థాన్ బికనీర్ జిల్లా నుంచి కర్మన్‌ఘాట్‌లోని గ్రీన్‌పార్క్ కాలనీ నివాసం చంద్రప్రకాష్ రామవత్‌కుమారుడు అనురాగ్ రామవత్ (22), గౌలిగూడ ఉస్మాన్‌షాహి ప్రాంతానికి చెందిన నరేందర్‌కుమార్‌ఖత్రీకుమారుడు ధవల్‌ఖత్రీ (22), పురానాపూల్ జింగుబస్తీ ప్రాంతానికి చెందిన నందకిషోర్ కుమారుడుకృష్ణ(21)లు కలిసి బెట్టింగ్ పాల్పడుతున్నారు. వారి నుంచి ఐఫోన్17, 15, ఒప్పోఫోన్‌రెప్2ఎఫ్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును గోల్కొండ జోన్ డిసిపి చంద్రమోహన్ ఆధ్వర్యంలో గోషామహల్ ఏసిపి ఎస్.సుదర్శన్ పర్యవేక్షణలో గోషామహల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు .పి.సి 2152 పి.మనీష్‌కుమార్‌యాదవ్ విజయవంతంగా పనిచేసినట్లుచెప్పారు. కాగా ఇన్‌స్పెక్టర్ శ్రావన్‌కుమార్ మాట్లాడుతూ ఆన్‌లైన్ బెట్టింగ్ పాల్పడే వారు, నిర్వహించే వారు ప్రోత్సహించే వారిపట్ల కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ కార్యకాలపాల గురించి తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు.

స్పోర్ట్స్ హాకథాన్‌లో మ్యాచ్ పాయింట్ క్రీడాకారుల జయభేరి

చిక్కడపల్లి ఏప్రిల్ 4 (ప్రభాతవార్త) : ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన స్పోర్ట్స్ హాకథాన్‌లో మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారులు అద్భుత ప్రదర్శనతో పతకాల పంట పండించారు. దాదాపు 20కి పైగా క్రీడా విభాగాల్లో జరిగిన ఈ మెగా ఈవెంట్‌లో అకాడమీకి చెందిన యువ క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని చాటి పలు విభాగాల్లో విజేతలుగా నిలిచారు. క్రీడాకారుల విజయంపై అకాడమీ హెడ్ కోచ్, జాతీయ క్రీడాకారుడు వేణు ముప్పాల హర్షం వ్యక్తం చేశారు. రాబోయే వేసవి సెలవులను పురస్కరించుకుని కొత్త క్రీడాకారుల కోసం మ్యాచ్ పాయింట్ అకాడమీ ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని (సమ్మర్ క్యాంప్) ఏర్పాటు చేసినట్లు వేణు ముప్పాల వెల్లడించారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలని కోరారు.

స్పోర్ట్స్ హాకథాన్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులు

ప్రజా పాలనలో భాగంగా పార్కుల పరిశుభ్రతపై ప్రత్యేక డ్రైవ్

పేట్ బషీరాబాద్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త : 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో 30వ రోజు సందర్భంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జీడిమెట్ల సర్కిల్‌లో శనివారం ప్రత్యేక క్లీన్ పార్క్ డ్రైవ్ నిర్వహించారు. పార్కులను శుభ్రపరచడం, నిర్వ హణ మెరుగుపరచడం కోసం చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జి. శ్రీజన మీనాక్షి ఎస్టేట్ కాలనీ పార్క్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పార్క్‌లోని పరిస్థితులను పరిశీలించి, స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలు, సూచనలు తెలుసుకున్నారు. ఈ కార్యక్ర మంలో డిప్యూటీ కమిషనర్ డి. శంకర్ సింగ్ (జీడిమెట్ల సర్కిల్55), యుబిడి మేనేజర్ మహేందర్, ఖాసిఫ్ హుస్సేన్, సాయి లికిత, జిలానీ పాషా, జవాన్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
డివిజన్-30, G.H.M.C
NIT No. 78/EE-30/GHMC/2025-26 తేది: 04.04.2026.
పని పేరు : GHMC, KZ, డివిజన్ 30 క్రింద వివిధ సివిల్ ఇంజనీరింగ్ పనులు. అంచనా మొత్తం (రూ.లక్షలలో) : 9.00. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీ మరియు సమయం : బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 04.04.2026, మ.3.00గం. మరియు బిడ్స్ స్వీకరణకు చివరి తేదీ, సమయం : 07.04.2026 మ.3.00గం.
అధికారి పేరు మరియు చిరునామా : ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-30, GHMC, 5వ అంతస్తు, ఆబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, ఆబిడ్స్, హైదరాబాద్. తదుపరి వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ వద్ద చూడవచ్చును.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ 30, GHMC.
DIPR.NO.143-PP/CL/ADVT/1/2026-27 తేది: 04.04.2026

జెజె నగర్ వినాయక ఆలయంలో ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

నేరెడ్‌మెట్, ఏప్రిల్ 4,ప్రభాతవార్త : నేరెడ్‌మెట్ చౌరస్తా పరిధిలోని జెజె నగర్ కాలనీలో ఉన్న వినాయక ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు జె.కే. సాయి కృష్ణ గౌడ్ తన స్వంత నిధులతో, విశేష భక్తి శ్రద్ధలతో ఈ కార్యక్రమాన్ని చేపట్టి స్థానికంగా ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం 7.30 గంటల నుంచి 11 గంటల వరకు బ్రాహ్మణ పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శాస్త్రోక్తంగా నిర్వహించిన పూజల అనంతరం ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈ వేడుకలో భక్తులు పెద్ద సంఖ్యలో గణపతి బప్పా నామస్మరణలతో ఆలయ ప్రాంగణాన్ని భక్తిమయంగా మార్చారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం ఆలయానికి ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత పెంచుతుందని భక్తులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సాయి కృష్ణ గౌడ్ సేవా తత్పరతను స్థానికులు కొనియాడారు. సమాజ సేవతో పాటు ధార్మిక కార్యక్రమాలకు కూడా ముందుండి సహకరించడం అభినందనీయమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జెజె నగర్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.ఎల్.ఎన్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు నిరంజన్ యాదవ్, వేలు , రావుల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సఫిల్‌గూడ చెరువు వద్ద మిల్లెట్ ఫుడ్ కోర్టుల ప్రారంభం

నేరెడ్‌మెట్ ఏప్రిల్ 4,ప్రభాతవార్త మల్కాజ్‌గిరి నగరపాలక సంస్థ పరిధిలోని సఫిల్‌గూడ చెరువు వద్ద మహిళల ఆర్థిక సాధికారతకు బాటలు వేస్తూ మిల్లెట్ ఫుడ్ కోర్టులు ప్రారంభమయ్యాయి. అదనపు కమిషనర్ (యూసీడి) రఘు ప్రసాద్, మోలాలి డిప్యూటీ కమిషనర్ గోపాల్ రావు, ప్రాజెక్ట్ డైరెక్టర్ (యూసీడి) సురేష్ కుమార్, భాను ప్రసాద్ ఈ కేంద్రాలను ప్రారంభించారు. లేక్ ఎకానమీ అభివృద్ధి దిశగా చెరువు, పార్కు పరిసరాలను వినియోగంలోకి తీసుకువస్తూ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమం కొనసాగుతోంది. దాశరధి స్వశక్తి సంఘానికి చెందిన జి. షర్మిల గ్రూప్ లోన్, స్వయం ఉపాధి రుణం సాయంతో ఇందిరా మహిళా శక్తి పథకం కింద మిల్లెట్ ఫుడ్ కోర్టు ఏర్పాటు చేశారు. వేణుగోపాల స్వామి స్వశక్తి సంఘానికి చెందిన ఏ. అనూష మిల్లెట్ చద్దన్నం కేంద్రాన్ని ప్రారంభించారు. పార్కుకు వచ్చే ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించేందుకు మొలకలు, ఉడికించిన కోడిగుడ్లు, స్వీట్ కార్న్, రాగి జావ, క్యారెట్, అనాస పండ్ల రసాలు, మిల్లెట్లతో తయారు చేసిన చద్దన్నం అందుబాటులో ఉంచనున్నారు. తక్కువ ఖర్చుతో పోషకాహారం అందించడం ద్వారా ప్రజారోగ్యానికి మేలు జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేస్తూ కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమం లో మల్కాజ్‌గిరి, మోలాలి సర్కిల్‌లకు చెందిన రిసోర్స్ పర్సన్స్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తా...

జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సిహెచ్ సురేష్...

కుషాయిగూడ, ఏప్రిల్ 4, ప్రభాతవార్త పార్టీ అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తానని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సిహెచ్ సురేష్ పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని మీర్పేట్ ఎస్ బి కాలనీకి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గత కొంతకాలంగా పార్టీ అభ్యున్నతికి చేస్తున్న కృషిని గుర్తించి సిహెచ్ సురేష్ను అధిష్ఠానం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ అధికారి ఉత్తర్వులు జారీ చేసింది. ఉప్పల్ నియోజకవర్గ ఇన్చార్జి మందమల్ల పరమేశ్వర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు మీదుగా అధికారిక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నాయకత్వంలో మందముల పరమేశ్వర్ రెడ్డి వదిలేష్ యాదవ్ నేతృత్వంలో తమంత పార్టీ అభ్యున్నతికి చిత్తశుద్ధితో పనిచేస్తామన్నారు. తమకు అప్పగించిన బాధ్యత ను సక్రమంగా నిర్వర్తిస్తామన్నారు.

మూసి బాధితులకు అండగా ఉంటాం : పగిళ్ల నర్సింగ్

మూసి పరివాహక ప్రాంతంలో పర్యటిస్తున్న బిఆర్ఎస్వి సీనియర్ నాయకులు పగిళ్ల నర్సింగ్ తదితరులు

మలక్ పేట, మార్చ్ 4, ప్రభాతవార్త: మూసీ బాధితులకు అండగా ఉంటామని బిఆర్ఎస్వి గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు పగిళ్ల నర్సింగ్ పేర్కొన్నారు. మూసీ పేరుతో రేవంత్ సర్కార్ లక్షన్నర కోట్ల స్కాం కు వ్యతిరేకంగా బిఆర్ఎస్వి పోరుబాట కార్యక్రమాన్ని మూసీ పరివాహక ప్రాంతంలోని పలు ప్రాంతాలలో పగిళ్ల నర్సింగ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మూసి బాధితులను కలిసి వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం పగిళ్ల నర్సింగ్ మాట్లాడుతూ రూ. 16.634 కోట్ల వ్యయంతో పూర్తయ్యే మూసి పునరుజ్జీవ ప్రాజెక్టు రూ. లక్షన్నరకోట్లకు ఎందుకు పెరిగిందని ప్రశ్నించారు. ప్రాజెక్ట్ రిపోర్ట్ సిద్ధం కాకముందే పేదల ఇల్లను ఎందుకు కులుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూసి బ్యూటిఫికేషన్ పేరిట లక్షల మందిని నిరాశ్రయులను చేయడం న్యాయమా అని ప్రశ్నించారు. బ్లాక్ లిస్టెడ్ కంపెనీకీ రూ.160 కోట్ల కాంట్రాక్టు కట్టబెట్టింది కేవలం ఎఐ గ్రాఫిక్స్ కొరకేనా అని నిలాదీశారు. బీఆర్ఎస్ హయంలో మూసి పునరుజ్జీవం దిశగా పడిన అడుగులకు ఫుల్ స్టాప్ పెట్టి, ఫక్తు రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుగా మార్చింది కమిషన్ల కోసమే అని ఆరోపించారు. మూసి పై కాంగ్రెస్ కుట్ర ను ఎండగడదామని, రేవంత్ సర్కార్ దోపిడిని అడ్డుకుందామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్, కె. సాయి నాయుడు, బి. కుమాల్ కుమార్, మోటపోతుల రమేష్ గౌడ్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు రూ.6వేల పెన్షన్‌ను అమలు చేయాలి : చెరుకు నాగభూషణం

సమావేశంలో ప్రసంగిస్తున్న చెరుకు నాగభూషణం, చిత్రంలో కొల్లి నాగేశ్వరరావు తదితరులు

మలక్ పేట, మార్చ్ 4,ప్రభాతవార్త: వికలాంగులకు రూ. 6వేల పెన్షన్ ను అమలు చేయాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు చెరుకు నాగభూషణం, కొల్లి నాగేశ్వరరావు లు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మేనిఫెస్టో అమలు సాధన సమితి ఆధ్వర్యంలో ఎలిమినేటి మాధవరెడ్డి కమ్యూనిటీ హాల్ లో వికలాంగుల అన్ని సంఘాలతో ముఖ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వికలాంగులకు ఇచ్చిన వికలాంగుల పెన్షన్లు రూ.6000 సామాజిక పెన్షన్లు రూ. 4000 తీవ్ర వైకల్యం గల దివ్యాంగుల పెన్షన్లు రూ.15000 పెంపును వెంటనే అమలు చేయాలని పేర్కొన్నారు. అన్ని రకాల ఆర్టీసీ బస్సుల్లో ఉచిత రవాణా, ప్రభుత్వ అన్ని శాఖల సంస్థలలో వికలాంగుల రిజర్వ్ ఉద్యోగాల భర్తీ, వికలాంగుల హక్కుల చట్టం ఖచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ రిజర్వేషన్లు తదితర హామీలు అమలు చేయనందుకు నిరసనగా మే రెండో తారీఖున అన్ని మండల స్థాయిల్లో నిరసన కార్యక్రమాలు, 22వ తారీఖున 119 నియోజకవర్గ స్థాయిలో నిరసన కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టాలని పిలుపునివ్వడం జరిగిందని వివరించారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టి మూడు సంవత్సరాలు కావస్తున్నప టికి నేటికీ ఈ అంశాల అమలుకు ప్రయత్నం చేయకపోవడం దుర్మార్గమైన చర్యా భావిస్తున్నామని తెలిపారు. ప్రమాణ స్వీకారం చేసే సమయంలో ఒక మరుగుజ్జు అమ్మాయికి ఔట్సోర్సింగ్ ఉద్యోగం ఇవ్వడం ద్వారా తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్రంలో ఏ వర్గ సంక్షేమానికైనా పని చేయాలంటే ముందు వికలాంగులకు పనిచేసి మిగతా వర్గాలకు పనిచేయాలని ముందుకు సాగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు వికలాంగుల సంక్షేమానికి ఏమాత్రం కూడా పట్టించుకోకపోవడం బాధాకరమైన విషయమని, దీనిని నిరసిస్తు నిరసన కార్యక్రమాలను చేపట్టడానికి పిలుపునివ్వడం జరిగిందని పేర్కొన్నారు. అప్పటికి ప్రభుత్వం దిగిరాకపోతే భవిష్యత్తులో ఎలాంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెరుకు నాగభూషణం, కొల్లి నాగేశ్వరరావు, ఆంజనేయులు గౌడ్, చిత్రం కృష్ణ, రాజ్యలక్ష్మి, ధనమ్మ, మాధవి, మారవేణి చంద్రశేఖర్ యాదవ్, వేణు గౌడ్, మరుగుజ్జు మల్లేష్, సైదులు, అశోక్, వెంకటేష్ , అశోక్ ముదిరాజ్, పాల్గొన్నారు.

అత్యుత్తమ ఆసుపత్రిగా మలక్ పేట్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి : ఎమ్మెల్యే బలాల

రైట్ అప్: ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో సీ ఆర్మ్ యంత్రాన్ని ప్రారంభించి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల ,చిత్రంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ త్రిలోక్ శ్యాం, డాక్టర్ సూర్య శ్రీ రావు, కరుణాకర్ తదితరులు

మలక్ పేట, ఏప్రిల్ 4, ప్రభాతవార్త: కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా మలక్ పేట్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి అత్యుత్తమ ఆసుపత్రిగా తీర్చిదిద్దనున్నట్లు మలక్ పేట్ నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. శనివారం ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన సి ఆర్మ్ యంత్రాన్ని ఎమ్మెల్యే బలాల ముఖ్యఅతిథిగా హాజరై ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ త్రిలోక్ శ్యాం, డాక్టర్ సూర్య శ్రీ రావు తదితరులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రి వైద్యులతో ఎమ్మెల్యే అహ్మద్ బలాల సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు అత్యుత్తమ వైద్య సేవలను అందించడానికి మలక్ పేట ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. వేసవి కాలాన్ని పురస్కరించుకొని డయాలసిస్ విభాగంలో నూతనంగా రెండు ఏసిలను ఏర్పాటు చేయనునట్లు వివరించారు. అదేవిధంగా ఆపరేషన్ థియేటర్ ను ఆధునాతనంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని పేర్కొన్నారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ త్రిలోక్ శ్యాం మాట్లాడుతూ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన సీ ఆర్మ్ యంత్రం శస్త్రచికిత్స లు చేసేటప్పుడు వైద్యులకు ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కరుణాకర్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు మినాజ్, ఆలీం, ముర్తుజా, నాజిమా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేత చొరవతో న్యూ మధురాపురి కాలనీ సమస్య పరిష్కారం

నవారు మల్లారెడ్డి చొరవతో దీర్ఘకాల సమస్య పరిష్కారం అయ్యి శుభ్రంగా మారిన న్యూ మధురాపురి కాలనీలోని ఓపెన్ స్థలం

సరూర్‌నగర్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ నాదర్‌గుల్ డివిజన్ పరిధిలోని అల్మాస్‌గూడ న్యూ మధురాపురి కాలనీలో సుదీర్ఘ కాలంగా ఖాళీ స్థలంలో ఉన్న చెత్తాచెదారం, రోడ్ల తవ్వకాల వ్యర్థాల సమస్య ఎట్టకేలకు సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నవారు మల్లారెడ్డి చొరవతో పరిష్కారం అయ్యింది. గత బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 4వ డివిజన్ పరిధి కిందకు వచ్చే ఈ కాలనీలో ఐదేళ్ళ క్రితం ఎస్ఎన్‌డిపి నాలా పనుల కోసం తవ్విన సిసి రోడ్డు వ్యర్థాలను, మట్టిని, చెత్తా చెదారాన్ని కాలనీలోనే ఇళ్ళ మధ్య విశాలంగా ఉన్న ఓపెన్ ప్లాటుల్లో డంప్ చేశారు. అయితే పనులు చేపట్టిన సంబంధిత కాంట్రాక్టర్ వ్యర్థాలను, చెత్తా చెదారాన్ని తొలగిస్తామని కాలనీవాసులకు మాట ఇచ్చి తర్వాత పట్టించుకోలేదు. బాధ్యత గల అధికారులు సైతం దీనిని నిర్లక్ష్యం చేశారు. దీంతో సంవత్సరాలు గడుస్తున్నా ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో ఇళ్ళ మధ్య చెత్తా చెదారం, రోడ్డు వ్యర్థాల కారణంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అప్పట్లో స్థానిక కార్పొరేటర్ సైతం ఈ సమస్యను పట్టించుకోలేదు, అయితే గత నెల రోజుల క్రితం స్థానిక కాలనీవాసులు సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, కాంటెస్టెడ్ కార్పొరేటర్ నవారు మల్లారెడ్డి దృష్టికి తేవడంతో ఆయన న్యూమధురాపురి కాలనీని సందర్శించి సమస్యను పరిశీలించారు. ఈ మేరకు ఆయన ప్రజల ఇబ్బందులను గమనించి బడంగ్‌పేట్ సర్కిల్ అధికారుల దృష్టికి తెచ్చారు. కాలనీలో ఇళ్ళ మధ్యలో ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించాలని ఆయన చేసిన వినతి ఎట్టకేలకు ఫలించింది. స్పందించిన అధికారులు జెసిబి, ట్రాక్టర్లను కాలనీకి పంపి చెత్తా చెదారం, రోడ్డు వ్యర్థాలను తొలగించడంతో సదరు ఓపెన్ ప్లాటు శుభ్రంగా తయారైంది. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేసి తమ సమస్యను పట్టించుకొని పరిష్కరించిన నవారు మల్లారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. శనివారం కాలనీ అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు వెంకట రమణ, ప్రధాన కార్యదర్శి రేవంత్, కాలనీవాసులు అశోక్, శ్రీనివాస్, కుమార్ చారి, పలువురు మహిళలతో కలిసి మల్లారెడ్డి న్యూ మధురాపురి కాలనీలో శుభ్రం అయిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యలను తన దృష్టికి తెస్తే వాటి పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానని స్పష్టం చేశారు.

మాజీ ఎంపిటిసి, బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబర్ తర్రె మల్లేష్ హఠాన్మరణం

తర్రె మల్లేష్ యాదవ్

సరూర్‌నగర్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: పూర్వ సరూర్‌నగర్ మండల పరిషత్ ప్రాదేశిక మాజీ సభ్యుడు (నాదర్‌గుల్ మాజీ ఎంపిటిసి), తెలంగాణ రాష్ట్ర బిజెపి కౌన్సిల్ మెంబర్ తర్రె మల్లేష్ యాదవ్ హఠాన్మరణం చెందారు. మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్‌లోని నాదర్‌గుల్ గ్రామానికి చెందిన ఆయన శనివారం తీవ్రమైన గుండె నొప్పితో ఆకస్మిక మృతి చెందారు. 60 సంవత్సరాల పైబడి ఉన్న ఆయన క్రమశిక్షణ జీవితం గడుపుతూ ప్రతి రోజూ మార్నింగ్ వాక్ చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్న తరుణంలోనే వాకింగ్ సమయంలో ఆయన కుప్పకూలడం గమనార్హం. ప్రతి రోజూ మాదిరిగానే శనివారం ఉదయం సహచరులతో కలిసి నాదర్‌గుల్ నుండి వాకింగ్ చేస్తూ గ్రామ శివార్ల వరకు వెళ్ళి అక్కడ వామ్‌అప్‌లు చేస్తుండగా ఆయనకు ఒక్కసారిగా తీవ్రమైన గుండెనొప్పి వచ్చి కుప్పకూలాడు. దీంతో సహచరులు వెంటనే ఆయనను బిఎన్‌రెడ్డినగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో ఆయన భౌతిక కాయాన్ని కుటుంబ సభ్యులు స్వగ్రామం నాదర్‌గుల్‌కు తరలించారు. హఠాన్మరణం చెందిన మల్లేష్ యాదవ్‌కు గ్రామంలో మంచి పేరుంది. 1995 నుండి 2000 వరకు ఆయన సరూర్‌నగర్ మండల ప్రజా పరిషత్‌లో నాదర్‌గుల్ ఎంపిటిసిగా పని చేసి గ్రామాభివృద్ధికి పాటుపడ్డారు. అదే విధంగా మొదటి నుండి బిజెపిలోనే కొనసాగుతూ పార్టీకి సేవలందించారు. ఆయన మృతితో నాదర్‌గుల్‌లో విషాద ఛాయలు అలముకున్నాయి. మూడు రోజుల క్రితం త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి నాదర్‌గుల్‌కు రాగా ఆయనను సన్మానించిన మల్లేష్‌ను గుర్తు చేసుకొని నాయకులు విచారం వ్యక్తం చేశారు. గ్రామ స్మశానవాటికలో జరిగిన అంత్యక్రియలకు రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులతో పాటు నాదర్‌గుల్, కుర్మల్‌గూడ, రాగన్నగూడ, కమ్మగూడ తదితర గ్రామాల ప్రజలు, రాజకీయాలకతీతంగా పలువురు నేతలు హాజరై నివాళులర్పించారు.

బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా కృష్ణ నియామకం

గొరిగె కృష్ణను సత్కరిస్తున్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తదితరులు

ఉప్పల్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా సీనియర్ నేత గొరిగె కృష్ణ నియమితులైయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం నుంచి ఆదేశాలు జారీ చేశారు. ఉప్పల్ మున్సిపల్ మాజీ చైర్మన్‌గా, బిజెపి సీనియర్ నేతగా, వివిధ అనుబంధ కమిటి సభ్యులుగా గొరిగె కృష్ణ పార్టీ కోసం సేవలు అందించారు. దీంతో పార్టీ అధిష్ఠానం ఆయనను బిజెపి రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా శనివారం కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని కలిసి సత్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో గొరిగె కృష్ణ మాట్లాడుతూ బిజెపితోనే తెలంగాణలో అభివృద్ధి జరుగుతుందని, పార్టీ కోసం పనిచేసే వారికి తగు గుర్తింపు ఉంటుందన్నారు. తెలంగాణలో బిజెపి అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాలచందర్, మహంకాళి లక్ష్మణ్, బండారు వెంకట్రావ్, రెడ్డిగారి దేవేందర్‌రెడ్డి, పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

హబ్సిగూడలో ఉచిత హోమియో వైద్య శిబిరం

హబ్సిగూడలో జరిగిన ఉచిత హోమియో వైద్య శిబిరంలో ప్రసంగిస్తున్న ప్రిన్సిపల్ డా.లింగరాజు తదితరులు

ఉప్పల్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : హోమియోపతి పితామహుడు డా.క్రిస్టియన్ పెడరిక్ సామ్యూల్ హనిమన్ జయంతి ఉత్సవాలలో భాగంగా శనివారం హబ్సిగూడ జెఎస్ఎన్ కమ్యూనిటిహాల్‌లో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ హోమియో కళాశాల ప్రిన్సిపాల్, అడిషనల్ డైరెక్టర్ డా. వి.లింగరాజు పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ హోమియో వైద్య ప్రాచుర్యం రోజురోజుకూ పెరిగిపోతుందని, రోగులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎలాంటి ఇతర ఇబ్బందులు లేకుండా వారి వ్యాధులను నయం చేసుకోవచ్చని సూచించారు. ఈ శిబిరంలో దాదాపు 89 మంది రోగులు వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రోగులకు హిమోగ్లోబిన్, బ్లడ్ షుగర్ తదితర పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ డా.సురేష్ కుమార్ రెడ్డి, హాస్పిటల్ డిప్యూటి సూపరిండెంట్ డా.పార్థసారధి, డా. శ్రీకాంత్, డా.దుర్గాప్రసాద్, డా. సౌజన్య, డా. సంఘమిత్ర మరియు పిజీ విద్యార్థులు, ఇంటర్న్ విద్యార్థులు, హబ్సిగూడ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు అనంతరెడ్డి, సంయుక్త కార్యదర్శి కె.సునీతరెడ్డి, ప్రదీప్ కుమార్‌రెడ్డి, కోశాధికారి భరత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రన్ ఫర్ జీసెస్ కార్యక్రమంలో నెమలి అనిల్

రన్ ఫర్ జీసెస్ కార్యక్రమంలో పాల్గొన్న నెమలి అనిల్

నాచారం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : గ్రేటర్ మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాచారం సర్కిల్ 20వ డివిజన్ మల్లాపూర్‌లో ఉదయం నిర్వహించిన రన్ ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని ప్రముఖ నాయకుడు నెమలి అనిల్ కుమార్ ప్రారంభించారు. ఆయన సమక్షంలో ఈ కార్యక్రమం భక్తి భావంతో, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ తిమోతి, శాంతా రాజు, కోఆర్డినేటర్ సద్గుణ పాల్గొన్నారు. వందలాది క్రైస్తవులు ఆనందోత్సాహాలతో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో ప్రేమ, శాంతి, సహనాన్ని పెంపొందించేందుకు ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతో అవసరమని తెలిపారు. రన్ ఫర్ జీసెస్ వంటి కార్యక్రమాలు ప్రజల్లో సానుకూల భావనలను పెంచి సమాజానికి మంచి సందేశాన్ని అందిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

సమిష్టి శ్రమతోనే లాలాగూడ వర్క్‌షాప్ టార్గెట్ పూర్తి

లక్ష్యాలను పూర్తి చేసిన అధికారులను సన్మానిస్తున్న సిడ్యూఎం సుమన

తార్నాక, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : రైల్వే కార్మికులు, ఉద్యోగులు సమిష్టిగా కృషి చేయడం వల్లనే లాలాగూడ వర్క్‌షాప్ ఈ ఏడాది లక్ష్యాలను విజయవంతంగా పూర్తి చేసిందని దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ సుమన తెలిపారు. లాలాగూడ వర్క్‌షాప్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిడ్యూఎం సుమన మాట్లాడుతూ వర్క్‌షాప్‌లో పనిచేస్తున్న కార్మికులు, సిబ్బంది అందరూ కలిసికట్టుగా శ్రమించి పనిచేయడం వల్లనే నిర్దేశిత టార్గెట్‌ను చేరుకోగలిగామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని రైల్వే జీఎం ద్వారా రైల్వే బోర్డుకు తెలియజేసినట్లు తెలిపారు. అనంతరం ఎలక్ట్రికల్ బ్రాంచ్ చైర్మెన్ కె.సీన నాయక్, కార్యదర్శి జి.పి రవికాంత్ మాట్లాడుతూ లాలాగూడ వర్క్‌షాప్ డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ ఎస్.మురళి, డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ అబ్దుల్ హుస్సైన్ సమర్థవంతమైన నాయకత్వం వహించడం వల్లనే ఈ విజయాన్ని సాధించగలిగామని అన్నారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ ఎలక్ట్రికల్ బ్రాంచ్ యూనియన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ తల్లి దేవాలయ వార్షికోత్సవం

పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

సైదాబాద్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: చంపాపేట డివిజన్ దుర్గానగర్ కాలనీలోని శ్రీ పోచమ్మ తల్లి దేవాలయం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎల్బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి దేవాలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు చీర శ్రీనివాస్, గండికోట శ్రీనాథ్, శేఖర్‌రెడ్డి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సిఎస్ఆర్‌లో డయాలసిస్ యూనిట్ ప్రారంభం

ప్రారంభోత్సవంలో పాల్గొన్న డాక్టర్ చేతన్, సతీష్

ఎల్.బి.నగర్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: చైతన్యపురి డివిజన్ సాయినగర్‌కాలనీలోని క్రిస్టల్ న్యూరో రిహాబిటేషన్ సెంటర్లో నూతనంగా ఏర్పాటు చేసిన డయాలసిస్ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ చేతన్ వీరమాచనేని ముఖ్యఅతిథిగా హాజరై కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఉచిత వైద్యశిబిరాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చేతన్ మాట్లాడుతూ అతి తక్కువ ఖర్చుతోనే డయాలసిస్ సేవలు అందించడం పట్ల సిఎస్ఆర్ నిర్వాహకులను అభినందించారు. రిహాబిటేషన్ సెంటర్ ఏర్పాటు వల్ల కిడ్నీ డయాలసిస్ రోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అదేవిధంగా పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం పట్ల నిర్వాహకులను అభినందించారు. ఉచిత వైద్య శిబిరం వల్ల ఎంతో మంది పేదలకు ఆరోగ్యపరమైన ప్రయోజనాలు కలుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్ నిర్వాహకులు టి.సతీష్, ఎం.సతీష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి:తోట

సమావేశంలో మాట్లాడుతున్న తోట మహేష్ యాదవ్

ఎల్.బి.నగర్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: శాసనసభ ఎన్నికల ముందు దివ్యాంగులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ నెరవేర్చాలని చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తోట మహేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. దివ్యాంగుల హక్కులపై కాంగ్రెస్ మేనిఫెస్టో అమలు సాధన సమితి నిర్వాహకుడు నాగభూషణం ఆధ్వర్యంలో చైతన్యపురి డివిజన్ ప్రభాత్‌నగర్‌కాలనీలోని మాధవరెడ్డి కమ్యూనిటీహాల్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి తోట మహేష్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే మరోసారి సమావేశం నిర్వహించి భవిష్యత్తు ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, వికలాంగుల సంక్షేమ సంఘం నాయకులు అశోక్, ప్రభాకర్, అంజి, వేణు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ దేవాలయంలో అడిషనల్ మెజిస్ట్రేట్ వినయ్ కుమార్ ప్రత్యేక పూజలు

పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అడిషనల్ మెజిస్ట్రేట్ వనం వినయ్ కుమార్, చిత్రంలో బాబు శ్రీనివాస్, చౌకి రవికుమార్ తదితరులు

మలక్ పేట, మార్చ్ 4, ప్రభాతవార్త: మలక్ పేట లోని శ్రీ పోచమ్మ దేవాలయంలో మలక్ పేట కు చెందిన కొత్తగూడెం భద్రాద్రి డిస్ట్రిక్ట్ ఫస్ట్ క్లాస్ అడిషనల్ మెజిస్ట్రేట్ వనం వినయ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ బాబు శ్రీనివాస్, సభ్యులు చౌకి రవికుమార్, పాల్మెంటన్ పార్క్ అధ్యక్షులు విజయ కుమార్ తదితరులు ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బుర్ర బాల రాజ్ గౌడ్, యాదగిరి, నసీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి పర్యటన

ఉప్పల్ ధర్మపురికాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తదితరులు

ఉప్పల్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఉప్పల్ ధర్మపురికాలనీ, అజ్మత్‌నగర్, ప్రశాంతినగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్యం, వీధిదీపాలు, ఇంజనీరింగ్ సమస్యలను పరిశీలించారు. పలు కాలనీలలో రోడ్లపై చెత్తా చెదారం తొలగించాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణ మరింత మెరుగుపర్చాలని సూచించారు. పొదుపు సంఘాల మహిళలు తయారు చేసిన పలు ఉత్పత్తులను కమిషనర్ పరిశీలించారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల కోసం పనిచేసే వారికి తగు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి కమిషనర్ శైలజ, ఎసిపి నాగిరెడ్డి, ఎంహెచ్ఒ వెంకటరమణ, ఎస్ఇ హరికిషోర్, డిఇ వెన్నెలగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం

రామంతాపూర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

రామంతాపూర్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : వేసవిలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడుతాయని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం రామంతపూర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వల్లపు శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఎం.పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముందుకు వచ్చిన శ్రీకాంత్ యాదవ్ సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు గణేష్ నాయక్, పూస సత్యనారాయణ,.జలీల్ పాషా, కంది శ్రవణ్ రెడ్డి, బుల్లెట్ అశోక్, ముత్యాల జంగయ్య, బాబురావు, బాలరాజ్, సందీప్, స్వామి, జి స్వామి, భాస్కర్ గంగపుత్ర, భాస్కర్, శ్రీధర్, రాజిరెడ్డి, ఇంద్రసేనా రెడ్డి, సంతోష్,యోగి, రాజ్‌కుమార్, చింటు, కిరణ్, గౌతమ్, రాంరాజ్, రమ కృష్ణ, నవీన్, మహేష్, మెంగా రవి, రాజు, రవి,విజ్జు, సతీష్ గౌడ్, సాయి యాదవ్, శంకర్, అజ్జు, అంబికా, శ్రీలత, శోభ తదితరులు పాల్గొన్నారు.

టిపిసిసి లీగల్, హ్యూమన్ రైట్స్‌అండ్ ఆర్‌టిఐ విభాగం కన్వీనర్‌గా ప్రమోద్ పటేల్

రాష్ట్ర చైర్మన్ అశోక్‌గౌడ్ చేతుల మీదుగా నియామకపు ఉత్తర్వులు అందుకుంటున్న ప్రమోద్ పటేల్

సరూర్‌నగర్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) లీగల్, హ్యూమన్ రైట్స్ అండ్ ఆర్‌టిఐ విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్‌లోని ప్రశాంతిహిల్స్ డివిజన్ మీర్‌పేట్ లెనిన్‌నగర్ ప్రశాంతినగర్‌కు చెందిన న్యాయవాది పొట్లచెరువు ప్రమోద్ నియమితులయ్యారు. చాలా సంవత్సరాలుగా పార్టీకి విధేయునిగా ఉంటూ న్యాయ సంబంధిత విషయాల్లో అండగా ఉంటున్న ప్రమోద్ సేవలను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానవర్గం ఆయనను టిపిసిసి లీగల్ సెల్‌కు కన్వీనర్‌గా నియమించింది. ఈ మేరకు టిపిసిసి లీగల్, హ్యూమన్ రైట్స్ అండ్ ఆర్‌టిఐ డిపార్ట్‌మెంట్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను ఆయన అడ్వకేట్లు సీపోర్ శ్రీనివాస్, దయాకర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ద్యుమ్నరెడ్డి తదితరుల సమక్షంలో అశోక్‌గౌడ్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రమోద్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ప్రతిష్ఠాత్మక తెలంగాణ పిసిసి లీగల్, మానవహక్కుల మరియు ఆర్‌టిఐ సెల్ కన్వీనర్ పదవిలో నియమించించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పాటు ఎఐసిసి లీగల్ సెల్ చైర్మన్ అభిషేక్ మను సింఘ్వి, రాష్ట్ర చైర్మన్ అశోక్‌గౌడ్, తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అప్పగించిన కార్యక్రమాలను విజయవంతం చేసి పదవికి న్యాయం చేయడానికి కృషి చేస్తానని ప్రమోద్ పటేల్ స్పష్టం చేశారు.

స్కూటి నేర్చుకుంటు చిన్నారులను ఢీ ..ఒకరు మృతి

కుషాయిగూడ, ఏప్రిల్4, ప్రభాతవార్త: ఓ మైనర్ బాలిక స్కూటి నేర్చుకుంటు అదుపుతప్పింది. ఇంటి ముందు ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారులను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఓ చిన్నారి. మృతిచెందగా మరొకరు తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటన శనివారం చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈసీనగర్కు చెందిన 14 సంవత్సరాల ఓ మైనర్ యువతి శనివారం సాయంత్రం సమయంలో స్కూటీ నేర్చుకుంటుంది. ఈ క్రమంలో అదుపుతప్పి ఇంటి ముందు ఆడుకుంటున్న అజీజ్ (3) రిత్వికరెడ్డి (5) అనే ఇద్దరు చిన్నారులను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అజీజ్ తలకు తీవ్రగాయం కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. రిత్విన్‌రెడ్డికి విరిగిన కాలు గాయంతో చికిత్స పొందుతున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్స్పెక్టర్ సుధాకర్ తెలిపారు.